


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 31-05-2022 సంపుటి: 03 సంచిక: 251 పేజీలు: 4 వెల: రూ 3-00


## లోకేష్‌ను చంద్రబాబు నమ్మడం లేదు: విజయసాయిరెడ్డి



తాడేపల్లి : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుపై ఎంపీ విజయసాయిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయసాయిరెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. "ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాట తప్పనిది. 70 శాతం సామాజిక న్యాయం చేశాము. పరిపాలనా సౌలభ్యం కోసం సంస్కరణలు చేసిన ప్రభుత్వం మాది. రూ. 1.42 లక్షల కోట్లు లబ్ధిదారులకు అందించాము. రైతుభరోసా వంటి పథకాలతో రైతులకు ప్రభుత్వం చేరువైంది. మహిళా సాధికారతను ప్రభుత్వం చేసి చూపింది. 50 శాతం పదవులు మహిళలకే ఇచ్చాము. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాము. విద్యారంగంలో నాడు-నేడు కార్యక్రమంతో స్కూళ్లను అభివృద్ధి చేశాము. చంద్రబాబు తెచ్చిన పథకం చెప్పుకోవటానికి ఒక్కటీ లేదు. మహానాడులో తొడలు కొట్టిస్తున్నాడు. జనంతో బూతులు తిట్టిస్తున్నారు. టీడీపీ అంటే తొడలు, దేహం, పార్టీ. తాగుబోతు అయ్యన్నపాత్రుడు నోటికి వచ్చింది మాట్లాడుతున్నారు. సీబీఎన్ అంటే చంద్రబాబు నాయుడు కాదు, చంద్రం బూతుల నాయుడు. ఇలా బూతులు తిట్టడమేనా చంద్రబాబు నైజమా?. మిగతావారు తిడుతుంటే చంద్రబాబు శునకానందం పొందుతున్నారు. చంద్రబాబు ఏడ్చినా సింపతీ రాదు. చంద్రబాబు తన కొడుకును నమ్మటంలేదు కానీ, దత్తపుత్రుడునే నమ్ముకుంటున్నారు. చంద్రబాబు తనకు తాను అపరచాణక్యుడు అనుకుంటున్నారు. కానీ, ఆయనను జనం చీదరించుకుంటున్నారని తెలుసుకోవటం లేదు. చంద్రబాబు అధికారంలో ఉంటే ఆయన మనుషులు తప్ప మరెవరూ బాగుపడరు. కానీ, జగన్ పాలనలో అన్ని వర్గాలకూ న్యాయం జరుగుతుంది. 2019లో అందరం ఎలా పని చేశామో 2024లో కూడా అంతకుమించి పని చేసి మళ్ళీ సీఎంగా వైఎస్ జగన్‌నే గెలిపించుకుంటాం" అని తెలిపారు.

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి : చంద్రబాబు, లోకేశ్

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా రెంటచింతల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనలో మరణించిన ఏడుగురి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రెంటచింతల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆగి ఉన్న లారీని టాటా ఏస్ వాహనం ఢీకొట్టిన దుర్ఘటనలో ఏడుగురు మరణించారు. ప్రమాదంలో మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను గురజాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. శ్రీశైలం మల్లన్నను దర్శించుకుని రెంటచింతలకు తిరిగివస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో టాటా ఏస్‌లో 38 మంది ఉన్నారని పోలీసులు చెప్పారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతోనే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.



## వైసీపీ భవిష్యత్‌ను తలుచుకుంటే భయమేస్తుంది : ఎంపీ రఘురామరాజు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైసీపీ రెబెల్ ఎంపీ రఘురామరాజు మరోసారి వైఎస్ జగన్ పనితీరుపై విరుచుకుపడ్డారు. రోజువారి రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మూడేండ్ల జగన్ పాలనపై తీవ్రంగా స్పందించారు. 95శాతం హామీలు అమలు చేశామని సీఎం చెప్పిన మాటల్లో ఎలాంటి నిజాలు లేవని 95 శాతం నెరవేర్చలేదని వ్యాఖ్యనించారు. అధికారంలోకి రాగానే మద్యపాన నిషేదం అమలు చేసి 2024లో ఓట్లు అడుగుతామని ఎన్నికల్లో విస్తృత ప్రచారం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి దివాళా తీశారని ఆరోపించారు. ఒంగోలులో టీడీపీ నిర్వహించిన మహానాడుకు ఏనాడు రాని విధంగా జనాలు రావడాన్ని వైసీపీ గుర్తించి ఆత్మావలోకం చేసుకోవాలని సూచించారు. ఏపీ మంత్రులు చేపట్టిన సామాజిక చైతన్య యాత్ర విఫలమయ్యిందని ఆయన పేర్కొన్నారు. వైసీపీ భవిష్యత్‌ను తలుచుకుంటే భయమేస్తుందని అన్నారు. వైఎస్ జగన్ ఎక్కడా కూడా సామాజిక న్యాయం పాటించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అబద్దాలు మానుకోవాలని సూచించారు.



## పేదలకు 'చేయూత'.. సంక్షేమ 'బావుటా'




వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేసి మూడేళ్లవుతోంది.. మనది హామీలను నెరవేర్చే ప్రభుత్వమని ప్రమాణ స్వీకారం రోజు చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. ఈ మూడేళ్లలో 95 శాతం హామీలను నెరవేర్చి తనది ప్రజా ప్రభుత్వమని చాటారు. పాదయాత్ర అనుభవాలే పునాదిగా, ప్రజల ఆశలు ఆకాంక్షల్ని నెరవేర్చడమే లక్ష్యంగా మేనిఫెస్టోను రూపొందించిన వైఎస్ జగన్.. దాన్ని అమలు చేయాలనే దృఢ సంకల్పంతో పక్కాగా అడుగులు వేశారు. దాంతో ఆయా పథకాలు అందుకుంటున్న లబ్ధిదారుల్లో సంతోషం కనిపిస్తోంది. వారి జీవితాల్లో మార్పులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వమందించే ప్రతి రూపాయిని సద్వినియోగం చేసుకుంటున్న ప్రజలు గతానికి ఇప్పటికి వున్న తేడాను స్పష్టంగా చెబుతున్నారు. పేద కుటుంబాలను పేదరికాన్నించి బైట పడేయాలనేది అసలైన లక్ష్యం.. అందుకోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనేక పథకాలను రూపొందించి అమల్లోకి తీసుకొచ్చారు. దాదాపుగా ఈ పథకాలన్నీ ప్రజాసంకల్ప పాదయాత్ర అనుభవాలతో రూపొందినవే.. వాటిలో చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం పథకాలున్నాయి. నలభై ఐదునుంచి అరవై సంవత్సరాల మధ్య వయస్సున్న మహిళలకు ప్రతి ఏడాది ఆర్థిక సాయం చేస్తే వారు ఆ డబ్బుతో కుటుంబ ఆదాయాలను పెంచుకుంటారని తద్వారా వారు పేదరికాన్నించి బైటపడాలని ఈ పథకాలను తయారు చేశారు. కాకినాడ రూరల్ తిమ్మాపురంలో చెరుకు రసం విక్రయిస్తు కుటుంబాన్ని నడిపిస్తోంది అనసూరి వెంకటలక్ష్మి. వెంకటలక్ష్మి, అప్పారావు దంపతులకు నలుగురు పిల్లలున్నప్పటికీ వారు ఉపాధి కోసం ఇతర ఊళ్ళకు వెళ్లిపోయారు. కరోనా లాక్ డౌన్ కారణంగా చాలా కష్టాలు పడ్డామని అలాంటి పరిస్థితుల్లో చేయూత పథకం ఆదుకున్నదని వీరు అంటున్నారు. చేయూత ద్వారా ప్రతి సంవత్సరం అందుతున్న 18,750 రూపాయలతో వీరు ఈ చిరు వ్యాపారం చేసుకుంటున్నారు. వెంకటలక్ష్మి దంపతులకు సొంత ఇళ్లు లేదు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు వీరికి ఇళ్ల స్థలం లభించేలా చూశారు. చేయూతతోపాటు పలు పథకాలు వెంకటలక్ష్మి అప్పారావులాంటివారికి అందుబాటులోకి వచ్చి వీరి కష్టాలను తీరుస్తున్నాయి. నలభై ఐదు సంవత్సరాలు దాటిన పేద కుటుంబాల మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తే వారు నిలదొక్కుకుంటారనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆలోచన. అందుకోసం తయారు చేసిన పథకాలే చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం. వీటిలో చేయూతను ఉపయోగించుకున్నవారిలో కాకినాడ జిల్లా గైగోలపాడుకు చెందిన మల్లేశ్వరి కూడా వున్నారు. ఈమె భర్త చాలా కాలం క్రితమే చనిపోయారు. నలుగురు పిల్లలుంటే వారికి వివాహాలైపోయి ఇతర ప్రాంతాల్లో సెటిలైపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో చేయూత పథకం ద్వారా లభిస్తున్న డబ్బుతో పచ్చళ్ల వ్యాపారం చేసి కొంతమేరకు ఆదాయం పొందుతున్నట్టు మల్లేశ్వరి అంటున్నారు. బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ వర్గాలకు చెందిన పేద మహిళలకు చేయూత ఉపయోగపడుతోంది. అయితే అదే సమయంలో అగ్రవర్ణ పేద కుటుంబాల మాటేమిటి? వారిని కూడా ఆదుకోవాలంటే ఏం చేయాలి? అనే ప్రశ్నలు తలెత్తాయి.. దీనికి సమాధానంగా కాపునేస్తం, ఈబీసీ నేస్తం పథకాలను తీసుకొచ్చారు.. వీటిలో కాపునేస్తాన్ని ఉపయోగించుకొని కొంతమేరకు ఉపశమనం పొందిన వారిలో జగత జ్యోతి వున్నారు. ఈమె రెండు దశాబ్దాల క్రితమే భర్తను కోల్పోయారు. ఒక కుమార్తె వుంటే ఆమెకు వివాహమై వెళ్లిపోయిందని.. తాను మాత్రం నాలుగైదు ఇళ్లలో ఇంటి పనులు చేసుకొని బతుకుతున్నానని జ్యోతి చెబుతున్నారు.

## సివిల్స్ విజేతలకు సీఎం జగన్ అభినందనలు



తాడేపల్లి: సివిల్స్‌లో ర్యాంకులు సాధించిన వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. 15వ ర్యాంక్ సాధించిన యశ్వంత్ కుమార్‌రెడ్డితో సహా తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు సీఎం అభినందనలు తెలిపారు. పి.సాహిత్య, శ్రుతి రాజ్యలక్ష్మి, రవికుమార్, కె.కిరణ్మయి, పాణి గ్రాహికార్తీక్, జి.సుధీర్ కుమార్‌రెడ్డి, శైలజ, శివానందం, ఏ.నరేష్‌లను సీఎం జగన్ అభినందించారు. సివిల్స్ సర్వీసెస్-2021 ఫలితాలు ఇవాళ (సోమవారం) ఉదయం విడుదల అయ్యాయి. అఖిల భారత సర్వీసుల కోసం యూపీఎస్సీ బోర్డు 685 మందిని ఎంపిక చేసింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన యశ్వంత్‌కుమార్ రెడ్డికి 15వ ర్యాంక్ దక్కింది. పూసపాటి సాహిత్యకు జాతీయ స్థాయిలో 24వ ర్యాంక్, శృతి రాజ్యలక్ష్మికి 25వ ర్యాంక్, రవికుమార్‌కు 38వ ర్యాంక్, కొప్పిశెట్టి కిర్మణయికి 56వ ర్యాంక్ దక్కింది. పాణిగ్రహి కార్తీక్‌కు 63వ ర్యాంక్, గడ్డం సుధీర్‌కుమార్‌కు 69వ ర్యాంక్, శైలజ 83వ ర్యాంక్, శివానందం 87వ ర్యాంక్, ఆకునూరి నరేష్‌కు 117వ ర్యాంక్, అరుగుల స్నేహకు 136వ ర్యాంక్, గడిగె వినయ్‌కుమార్ 151 ర్యాంక్, దివ్యాన్షు శుక్లాకు 153వ ర్యాంక్, కన్నెధార మనోజ్‌కుమార్‌కు 157వ ర్యాంక్, బొక్కా చైతన్య రెడ్డికి 161వ ర్యాంక్, దొంతుల జీనత్ చంద్రకు 201వ ర్యాంక్, అకవరం సాస్యరెడ్డికి సివిల్స్ జాతీయ స్థాయిలో 214వ ర్యాంక్ దక్కాయి.

## వారసత్వం, కుంభకోణాలతో దేశం కుదేలైంది: మోదీ



న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు పూర్తైంది. ఈ సందర్భంగా కరోనా మహమ్మారితో అనాథలైన పిల్లలకు చేయూత ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్' పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన వీడియా కాన్ఫరెన్సులో ప్రధాని నరేంద్ర మోదీ పథక ప్రయోజనాలను వెల్లడించారు. ఈ సందర్భంలోనే కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 2014కి ముందు దేశంలో వారసత్వం రాజ్యమేలేదని, ఎక్కడ చూసినా కుంభకోణాలే కనిపించేవని, అయితే ఇప్పుడు అలాంటి పరిస్థితులు ఉండవని, దేశం కొత్త శిఖరాలను చేరుకుంటోందని మోదీ అన్నారు. "ఈరోజు మా ప్రభుత్వం ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుంది. దేశ విశ్వాసం, దేశ ప్రజల విశ్వాసం ఎంతగానో పెరిగింది. కానీ 2014 ముందు పరిస్థితి వేరేలా ఉండేది. ఎక్కడ చూసినా అవినీతి, వేల కోట్ల కుంభకోణాలే కనిపించేవి. వారసత్వం రాజ్యమేలేది. దేశమంతా ఉగ్రవాదం వ్యాప్తి చెంది ఉండేది. వీటన్నిటితో దేశం అతలాకుతలమైంది. కానీ గడిచిన ఎనిమిదేళ్లుగా దేశం పురోగతి సాధిస్తోంది. బహుశా దీన్ని ముందుగా ఎవరూ ఊహించి ఉండరు. ఈరోజు దేశఖ్యాతి విశ్వవ్యాప్తమైంది. ప్రపంచ వేదికలపై భారత్ శక్తివంతంగా కనిపిస్తోంది" అని మోదీ అన్నారు.

### రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు రవిచంద్ర ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ: రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు రవిచంద్ర ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంటులోని తన కార్యాలయంలో రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు.. రవిచంద్రతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎంపీలు కే. కేశవరావు, నామా నాగేశ్వర రావు, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొన్నారు. ఎంపీ రవిచంద్రకు శుభాకాంక్షలు తెలిపారు. టీఆర్ఎస్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన బండ ప్రకాశ్ రాజీనామా చేయడంతో ఖాళీ అయిన స్థానంలో రవిచంద్ర ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే.



## నోరులేని మూగ జీవులు వైసీపీ మంత్రులు

### ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

అమరావతి మే 30 వైసీపీ మంత్రులు నోరులేని మూగ జీవులని ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శించారు. రాష్ట్రంలో నలుగురు రెడ్లు రాజ్యాధికారం చెలాయిస్తున్నారని, బీసీ మంత్రులకు అధికారాలు, సామాజిక న్యాయం ఎక్కడ అమలవుతుందని ప్రశ్నించారు. విశాఖలో ఆయన మీడియా సమావేశంలో మూడేండ్ల వైసీపీ సంబురాలపై మాట్లాడారు. ఏ ప్రభుత్వమైనా మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుడితే జగన్ విధ్వంసాలతో మొదలు పెట్టారని వెల్లడించారు. నీటి పారుదల వ్యవస్థను ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సర్వనాశనం చేశారని విమర్శించారు. మోసపూరిత సంక్షేమం పేరిట ప్రజలను మోసం చేశారని అన్నారు. మూడేళ్లలో ప్రభుత్వం ప్రజలను ముప్పుతిప్పలు పెట్టిందని విరుచుకుపడ్డారు. వైజాగ్ నగరాన్ని ఐటీ నగరంగా తీర్చిదిద్దేందుకు లోకేశ్ ప్రయత్నించగా మూడేండ్లు వైసీపీ పాలనలో ఏ ఒక్కటి ప్రాజెక్టు విశాఖకు రప్పించలేదని ఆరోపించారు. స్వయాన పెట్రోలు, డీజిల్ ధరల సెస్సు తగ్గించాలని ప్రధాని కోరితే వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. భూముల రిజిస్ట్రర్ ధరలను పెంచారని, చివరకు చెత్త పన్ను కూడా వేసి ప్రజలపై భారం వేశారని తెలిపారు. సొంత వ్యక్తులకు ప్రజల సొమ్మును దోచిపెడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన యాత్రలపై ప్రజలు చీదరించుకున్నారని పేర్కొన్నారు.



# సంపాదకీయం

మంగళవారం 31-05-2022

## సోషల్ ఇంజనీరింగ్ లో కానరాని అందలం

ప్రపంచంలో భారతదేశానికి ఒక విశిష్ట స్థానం ఉండటానికి గల కారణం మన సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్ల విలువలు, జానపద రీతులు, భిన్నత్వంలో ఏకత్వాన్నీ కలిగి ఉండటమే. వీటి గురించి తెలిపేదే సామాజిక శాస్త్రం. సమాజ పరిణామ దశలను, మనుగడను, మానవ సంబంధాలను, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సామాజిక అంశాలను గురించి ఇది వివరిస్తుంది. సమాజ మనుగడ సక్రమంగా కొనసాగేందుకు అంతర్గత సంబంధాలు, సంస్కృతీకరణ, సామాజీకరణ ఎలా ఉపయోగపడతాయో తెలుపుతుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో దేశంలో ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతిలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో విద్యా వ్యవస్థలోనూ సమాజ శాస్త్రానికి క్రమంగా గుర్తింపు కరువవుతున్నదిక్రమంగా మన దేశ ఆచార వ్యవహారాలలో పెనుమార్పులు సంభవించి, రాబోవు తరాలకు వాటి గురించి తెలుసుకునే అవకాశం కూడా కనుమరుగవుతుందా? అనే అనుమానం కలుగుతున్నది. రోజుకో ఆవిష్కరణతో, శారీరక శ్రమకంటే మానసిక ఆలోచనకే ఎక్కువ విలువనిస్తున్న ప్రస్తుత తరుణంలో టెక్నాలజీకి సంబంధించి నూతన కోర్సులు పుట్టుకొచ్చినప్పటికీ, ఆంగ్లేయుల నుంచి స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టిన మహానీయులను మరువకుండా, వారి గురించి విద్యలో భాగంగా నేర్చుకుంటూనే ఉన్నాం కదా! అలాగే, మన ఉమ్మడి కుటుంబాలు, మన విలువలు, ఆచారాలు, సాంప్రదాయాలు, జానపద రీతులు, సంస్కృతిలో పలుమార్పులు సంభవించినప్పటికీ, వాటి వలన మనకు కలిగిన ఉపయోగం, గౌరవాలను రాబోయే తరాలవారికీ అందించాల్సిన ఆవశ్యకత లేదా? ప్రభుత్వాలు ఈ విషయం మీద ప్రత్యేక దృష్టి కేంద్రీకరించవలసిన అవసరం ఉన్నది.గ్రామీణ ప్రాంతాల సాదకబాధకాలు, సామాజిక సమస్యల పరిష్కారమార్గాలు, సమాజాభివృద్ధికి సంబంధించిన విషయాలను సామాజిక శాస్త్రంలో భాగంగా నేర్చుకోవచ్చు. అందుకే ఈ కోర్సు సమాజాభివృద్ధికి తోడ్పడే వీలున్నది. గతంలో ఇంటర్, డిగ్రీ, పీజీ స్థాయిలో ఈ కోర్సుకు ప్రాధాన్యం ఉండేది. ఉత్తర భారతంలోనూ డిమాండ్ ఉంది. కానీ, నేడు దీనికి దక్షిణ భారతంలో అంతటి ప్రాధాన్యం లేదు. మన రాష్ట్రంలో ఉస్మానియా, కాకతీయ, శాతవాహన యూనివర్సిటీలు మాత్రమే ఈ కోర్సును అందిస్తున్నాయి.ఇంటర్, డిగ్రీ కళాశాలలలో ఎక్కడా దీని జాడలేదు. అందుకే ఈ కోర్సు చదివేందుకు విద్యార్థులు నిరాసక్తత చూపుతున్నారు. చదివినవారికీ ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అన్ని కళాశాలలో సామాజిక శాస్త్రాన్ని బోధనాంశంగా పెట్టాలనే కేంద్ర ప్రభుత్వం ఆలోచన ముందుకు సాగడం లేదు. పోటీ పరీక్షలలో సామాజిక శాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలు అడుగుతున్నారు. ఉపాధ్యాయ శిక్షణా కోర్సులలో సామాజిక శాస్త్రాన్ని ఒక సబ్జెక్టుగా పెట్టినప్పటికీ, బోధకుల కొరతతో ఫలితం ఉండడం లేదు.గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు రకాల అంశాలను అధ్యయనం చేయడానికి సామాజిక శాస్త్రం తోడ్పడుతుంది. మానసిక రోగులను పరీక్షించడానికి దోహదపడుతుంది. ప్రతి దవాఖానాలో ఒక సామాజిక శాస్త్ర నిపుణుడు తప్పక ఉండాలి. ఎంతో ఒత్తిడికి గురవుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను మానసికంగా ఉల్లాసపరచడానికి సైతం ఈ శాస్త్రం ఉపయోగపడుతుంది. పరీక్షలలో తప్పామని కొందరు, అనుకున్న ర్యాంక్ రాలేదని మరి కొందరు, చదువుకోవాలనుకున్న కాలేజీలో సీటురాలేదని ఇంకొందరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారు.వారికి ఈ శాస్త్రం పట్ల అవగాహన లేకపోవడమే అందుకు కారణం. ప్రతి విద్యార్థి సామాజిక శాస్త్ర నైపుణ్యాన్ని పెంపొందించుకునేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి. దేశంలోని అన్ని జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలలో ఈ కోర్సును ప్రవేశపెట్టాలి. చదివినవారికి ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఇందుకోసం సామాజికవేత్తలు, సామాజిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, ప్రముఖులు, విద్యావంతులు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపాలి. సామాజిక శాస్త్ర ఆవశ్యకతను తెలియజేయాలి. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో ఈ కోర్సును ప్రవేశపెట్టడానికి కృషి చేయాలి.

# తెలుగు తమ్ముళ్లలో మహానాడు జోష్



ఒంగోలు, మే 30, ఆవిర్భావం నుంచీ తెలుగుదేశం పార్టీని నడిపించింది..ఇప్పుడు పరుగులు పెట్టిస్తున్నది కార్యకర్తలే. మహానాడు వేదికగా ఆ విషయం మరోసారి రుజువైంది. 2019 ఎన్నికలలో దారుణ పరాజయం తరువాత మూడేళ్లలోనే మళ్లీ అద్భుతంగా తెలుగుదేశం పుంజుకోవడానికి కారణం తెలుగు తమ్ముళ్లే. 2019లో జగన్ రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన తరువాత తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా వేధింపులు, దాడులు, ఆర్థిక మూలాలను దెబ్బతీసే చర్యలతో పెట్రేగిపోయారు. స్థానిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు నామినేషన్ వేయడానికి కూడా అవకాశం లేనంతగా వైసీపీ అరాచకాలు శృతి మించాయి.నేతలు అడుగు బయటపెట్టడానికి కూడా జంకే పరిస్థితులు ఎదుర్కొన్నారు. కొందరైతే జావగారిపోయారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండిపోయారు. అయితే కార్యకర్తలు మాత్రం బెదరలేదు. భయపడలేదు. మడమ తిప్పలేదు. ఎక్కడికక్కడ వైసీపీ అరాచకాలకు ఎదురొడ్డి నిలబడ్డారు. వైసీపీ దాడులకు గుండెలడ్డేసి నిలబడ్డారు. ఫలితం.. ప్రజలలోనూ వైసీపీ అరాచకాలను నిలదీసి ప్రశ్నించే ధైర్యం వచ్చింది. ఆ ధైర్యం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంతులు, ఎమ్మెల్యేలను నిలదీసి ప్రశ్నించేలా చేసింది.నిరసన సెగలను తట్టుకోలేక వారు 'గడపగడపకూ' మొహం చాటేశారు. అంతెందుకు ముఖ్యమంత్రి జగన్ సభనే జనం బాయ్ కాట్ చేసే ధైర్యం ప్రజలకు రావడానికి కారణం తెలుగుదేశం కార్యకర్తల సాహసం, పట్టుదలే. ఇంకానా ఇకపై సహించం అంటూ జనం ప్రభుత్వాన్ని ధైర్యంగా ఎదిరించే దమ్ము తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నుంచే వచ్చింది. రైతు భరోసా కార్యక్రమంలో జగన్ ప్రశ్నిస్తుండగానే జనం నిరసన వ్యక్తం చేస్తూ 'వాకౌట్' చేశారు. పోలీసులు అడ్డుకుంటున్నా లెక్క చేయలేదు. ఆ ధిక్కారం తెలుగుదేశం కార్యకర్తలు ఇచ్చిన ధైర్యమే. మహానాడు వేదికగా తెలుగు దేశం అధినేత చంద్రబాబు ఇదే చెప్పారు. తెలుగుదేశం బలం కార్యకర్తలేనన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవడానికి తాము సన్నద్ధంగా ఉన్నామన్న విషయాన్ని లక్షలాదిగా మహానాడుకు తరలి వచ్చి మరీ తెలియజేశారు. బస్సులు అందుబాటులో లేవు, పార్టీ పరంగా జనసమీకరణ జరగలేదు. ఊళ్లకు ఊళ్లు ట్రాక్టర్లు.. కార్లు, మోటారు సైకిళ్లు, సైకిళ్లు ఇలా ఏది దొరికితే అది పట్టుకుని స్వచ్ఛందంగా తరలి వచ్చారు. మహానాడుకు ఈ స్థాయిలో జనం తరలి వస్తారని పార్టీ వర్గాలు కూడా ఊహించలేదు. జరుగుతుందని టీడీపీ వర్గాలు కూడా ఊహించలేదు. సామాజిక మాధ్యమం ద్వారా సమాచారాన్ని షేర్ చేసుకుంటూ, ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ఐక్యమౌతున్నారు.నాయకుల పిలుపు కోసం చూడకుండా ఎక్కడికక్కడ ప్రభుత్వ విధానాలను అడ్డుకుంటున్నారు. ఆ స్ఫూర్తి మహానాడులో ప్రస్ఫుటమైంది. నాయకులు పార్టీలు మారినా క్యాడర్ స్థిరంగా తెలుగుదేశంతోనే ఉంది. తెలుగుదేశం పార్టీ నేతల పార్టీ కాదు, కార్యకర్తల పార్టీ అంటూ పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు నుంచీ, ప్రస్తుత అధినేత చంద్రబాబు వరకూ ఈ నాలుగు దశాబ్దాలుగా ఏదైనా నమ్మారో, ఏదైతే చెబుతూ వచ్చారో అది నూటికి నూరుపాళ్లు నిజమని మహానాడు మరోసారి రుజువు చేసింది. మహానాడుకు ప్రభుత్వం అనేక ఆటంకాలు కల్పించింది. సభకు వెళ్లిన వారి వివరాలు తెలుసుకుని పథకాలు ఆపేస్తామని బెదరింపులకు దిగింది. మీకు మీ పథకాలకూ ఓ దండం అంటూ వైసీపీ బెదరింపులను ఖాతరు చేయకుండా తరలి వచ్చారు. జగన్ ముందస్తు యోచన చేస్తుంటే.. మేం రెడీ తెలుగుదేశం క్యాడర్ సమర శంఖం మోగించేసింది

# ఆత్మకూరులో కమలం లెక్కలేంటీ



నెల్లూరు, మే 30, చెప్పేదొకటి.. చేసేదొకటి ఏపీలో బీజేపీ తీరు సరిగ్గా ఇలాగే ఉంటోంది. మంత్రి మేకపాటి గౌతం రెడ్డి మరణంతో ఖాళీ అయిన ఆత్మకూరు శాసనసభ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికలో పోటీలోకి దిగుతామంటూ బీజేపీ చేసిన ప్రకటన వెనుక వ్యూహమేమిటన్నది రాజకీయ పండితులకు సైతం అంతుబట్టడం లేదు. సాధారణంగా సిట్టింగ్ ఎమ్మెల్యే మరణంతో ఖాళీ అయిన నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరుగుతుంటే.. రాజకీయ పార్టీలు పోటీకి దిగకుండా ఉండటమన్నది ఒక సంప్రదాయంగా కొనసాగుతూ వస్తున్నది.అయితే బీజేపీ మాత్రం పోటీకి దిగుతామంటూ చేసిన ప్రకటన ఏ ఉద్దేశంతో అన్న చర్చ రాజకీయ వర్గాలలో జోరుగా సాగుతున్నది. గతంలో బద్వేలు నియోజవకర్గ ఉప ఎన్నికలో కూడా బీజేపీ పోటీ చేసి దారుణంగా పరాజయం పాలైన సంగతి ఈ సందర్భంగా ఒక సారి గుర్తు చేసుకోవాల్సి ఉంటుంది. వైఎస్సార్‌సీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ వెంకటసుబ్బయ్య మరణింతో కడప జిల్లా బద్వేలు అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైనప్పుడు తెలుగుదేశం పార్టీ పోటీకి దూరంగా ఉంది. మరణించిన ఎమ్మెల్యేకు సానుభూతిగా అక్కడ ఆయన భార్యను వైసీపీ రంగంలోకి దింపడంతో ఆ ఉప ఎన్నికను ఏకగ్రీవం చేయాలని తెలుగుదేశం భావించింది. సెంటిమెంట్, ఆనవాయితీని పాటించాలని తెలుగుదేశం నిర్ణయం తీసుకొంది. జనసేన కూడా పోటీ నుంచి తప్పుకుని ఆనవాయితీని, సెంటిమెంటునూ గౌరవించింది. అయితే ఏ మాత్రం గెలుపు అవకాశం లేని బీజేపీ, కాంగ్రెస్ లు మాత్రం ఉప ఎన్నికలో పోటీకి దిగాయి. ఫలితం అనూహ్యమేమీ కాదు. బద్వేలులో బీజేపీ, కాంగ్రెస్ లు డిపాజిట్లు కోల్పోయాయి. వాటికి డిపాజిట్లు వచ్చినా ఒరిగేదేం లేదు కానీ, ఆ రెండు పార్టీలూ పోటీలో ఉండటం వైసీపీకి ప్రయోజనం చేకూర్చిందనే చెప్పాలి.ఇప్పుడు ఆత్మకూరులోనూ బీజేపీ పోటీకి దిగుతానంటూ ముందుకు వస్తున్నది. బీజేపీ వైఖరి వైసీపీ నెత్తిన పాలుపోయడం కోసమేనా అన్న ప్రశ్నకు విశ్లేషకులు ఔనని అంటున్నారు. కనీసం పొత్తులో ఉన్న జనసేన పార్టీతో చర్చించకుండా బీజేపీ ఏపీ అధ్యక్షుడు సోము వీర్రాజు తమ పార్టీ ఆత్మకూరు ఉప ఎన్నికలో పోటీ చేస్తుందని ప్రకటించడం ఎంత వరకూ సబబని ప్రశ్నిస్తున్నారు. ఎన్నిక ఏకగ్రీవం అయితే వైసీపీ విజయం సాధించిందని మాత్రమే చెప్పుకోవడానికి వీలుంటుంది. అలా కాకుండా మరో పార్టీ పోటీలో నిలబడటంతో గత కంటే ఎక్కువ మెజారిటీ సాధించామంటూ గొప్పగా ప్రచారం చేసుకుంటుంది. ఈ ప్రచారం రానున్న అసెంబ్లీ ఎన్నికలలో వైసీపీకి ఏదో మేరకు సానుకూలత చేకూరుస్తుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.వైసీపీ విధానాలను విమర్శిస్తున్న బీజేపీ చేతలలో మాత్రం ఆ పార్టీకి ప్రయోజనం చేకూరేలా వ్యవహరిస్తున్నదని అంటున్నారు. కనీస ఓట్లు సాధించుకునే బలం కూడా లేని బీజేపీ సెంటిమెంటును, సంప్రదాయాన్నీ కూడా కాదని ఆత్మకూరు ఉప ఎన్నికలో అభ్యర్థిని నిలబెడతానంటూ ముందుకు రావడం వైసీపీకి మేలు చేయడానికేనన్న అనుమానాలు తలెత్తుతున్నాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. బద్వేలు అనుభవం తరువాత కూడా ఆత్మకూరు ఉప ఎన్నికలో బీజేపీ పోటీకి సిద్ధపడం అందుకు సంకేతమనని అంటున్నారు.

# కర్నూలు జిల్లాల్లో ఇద్దరు చొప్పున తమ్ముళ్లు రె'ఢీ'

కర్నూలు, మే 30,ఉమ్మడి కర్నూలు జిల్లా టీడీపీలో మూడు కుటుంబాల నుంచి గతంలో ఇద్దరు చొప్పున పోటీ చేశారు. 2019 ఎన్నికల్లో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కేఈ కృష్ణమూర్తి కుటుంబంలో పత్తికొండ నుంచి కేఈ శ్యాంబాబు, డోన్ నుంచి కేఈ ప్రతాప్ పోటీ చేశారు. కోట్ల కుటుంబంలో కర్నూలు ఎంపీగా సూర్యప్రకాష్‌రెడ్డి, ఆలూరులో కోట్ల సుజాత బరిలో ఉన్నారు. భూమా ఫ్యామిలీ నుంచి ఆళ్లగడ్డలో అఖిలప్రియ, నంద్యాలలో బ్రహ్మానందరెడ్డి ఎన్నికల గోదాలోకి దిగారు. ఇప్పుడు ఈ కుటుంబాల నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేది ఎవరు? పోటీకి దూరంగా ఉండేదెవరు అనేది చర్చగా మారిందిడోన్ అభ్యర్థిగా సుబ్బారెడ్డిని ప్రకటించిన తర్వాత ఈ చర్చ మరింత ఊపందుకుంది. కేఈ కుటుంబం నుంచి ప్రభాకర్, శ్యాంబాబులు మరోసారి బరిలో దిగాలని చూస్తున్నారు. వీరిలో ప్రభాకర్ ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. డోన్ లేదా ఆలూరు నుంచి పోటీ చేస్తానని చెబుతున్నా.. డోన్ అభ్యర్థిగా సుబ్బారెడ్డిని ప్రకటించేశారు చంద్రబాబు. ఇక మిగిలింది ఆలూరు. అక్కడ కోట్ల సుజాత కర్చీఫ్ వేశారు. ఏదీ కాకపోతే కర్నూలు ఎంపీగా అయినా బరిలో దిగుతానని చెబుతున్నారట. అయితే అక్కడ కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఉన్నారు. దీంతో కేఈ ప్రభాకర్ పరిస్థితి ఏంటన్నది ప్రశ్న. పత్తికొండను వీడేది లేదంటున్నారు ప్రభాకర్ అన్న కుమారుడు కేఈ శ్యాంబాబు.కోట్ల కుటుంబంలో టీడీపీ టికెట్లు ఆశిస్తోంది ఇద్దరే. ఒకరు సూర్యప్రకాష్‌రెడ్డి. రెండో వ్యక్తి సుజాతమ్మ. వీరిలో సూర్యప్రకాష్‌రెడ్డి కర్నూలు ఎంపీగా పోటీ చేయడానికి ఆసక్తి చూపిస్తుండటంతో చంద్రబాబు ఆయన్ని కాదనే పరిస్థితి లేదంటున్నారు. ఆలూరులో కోట్ల సుజాతకు టీడీపీ నుంచే నలుగురు నేతలు పోటీగా ఉన్నప్పటికీ ఆమె అభ్యర్థిత్వానికే మొగ్గు చూపొచ్చన్నది ఒక వాదన. అయితే చివరి నిమిషంలో ఏం జరుగుతుందో చెప్పలేమంటున్నారు పార్టీ నేతలు.ఆళ్లగడ్డ విషయంలో భూమా అఖిల ప్రియ కేంద్రంగా ఇటీవల జరుగుతున్న ప్రచారం ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇక్కడ బీజేపీ నేతగా ఉన్న ఆమె బంధువు భూమా కిశోర్‌రెడ్డి టీడీపీలో చేరతారనే ప్రచారం ఉంది. అదే జరిగితే కిశోర్‌రెడ్డికే టీడీపీ టికెట్ ఇస్తారని టాక్ నడుస్తోంది. దీనికితోడు అఖిలప్రియ, కిశోర్‌రెడ్డి మధ్య వివాదాలు పొలిటికల్ వాతావరణాన్ని హీటెక్కిస్తున్నాయి. ఇక నంద్యాలలో భూమా బ్రహ్మానందరెడ్డి మరోసారి పోటీకి ఆసక్తితోఉన్నప్పటికీ.. అక్కడ ఏవీ సుబ్బారెడ్డి, ఫరూఖ్‌ల నుంచి పోటీ తప్పకపోవచ్చని భావిస్తున్నారు. ఫరూఖ్ గతంలో పోటీ చేశారు. ఏవీ సుబ్బారెడ్డికి ఇక్కడ పట్టుంది. పైగా అఖిలకు, బ్రహ్మానందరెడ్డికి పడటం లేదని చెబుతున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో భూమా కుటుంబం నుంచి ఎవరు ఎక్కడ నుంచి పోటీ చేస్తారన్నేది సస్పెన్స్‌గా ఉందట. మరి.. డోన్‌లో క్లారిటీ ఇచ్చినట్టుగానే ఈ కుటుంబాలకు కూడా ముందుగానే చంద్రబాబు స్పష్టత ఇస్తారో లేదో చూడాలి.

## వల్లభనేని వంశీ యూ టర్న్...

విజయవాడ, మే 30, టీడీపీ నుంచి వెళ్లి జగన్ గూటికి చేరిన గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హనుమాన్జంక్షన్ లో జరిగిన ఓ క్రికెట్ టోర్నీ బహుమతి ప్రదానోత్సవానికి హాజరైన ఆయన.. టీడీపీపై ప్రశంసలు కురిపిస్తూ చేసిన వ్యాఖ్యలు నియోజకవర్గ రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. తాను ఎప్పుడూ టీడీపీని విమర్శించలేదని, ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ చాలా గొప్పదని పొగిడారు. టీడీపీ చెడ్డదని తాను ఎప్పుడూ అనలేదని, కేవలం లోకేశ్ వచ్చిన తర్వాత పార్టీ విధానాలు దెబ్బతిన్నాయని మాత్రమే అన్నానని వంశీ తెలిపారు. మొన్నటివరకు టీడీపీపై విమర్శనస్త్రాలు సంధించిన వంశీకి ఇప్పుడు సడెన్‌గా అంత ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చిందనేది పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. జగన్ కు హ్యాండిచ్చి మళ్లీ సైకిలెక్కుతారా? అనే ప్రచారం జరుగుతోంది.కొంతకాలంగా గన్నవరంలోని రాజకీయ పరిస్థితులు వంశీకి ప్రతికూలంగా ఉన్నాయి. నియోజకవర్గ వైసీపీ శ్రేణులు వంశీకి సహకరించడం లేదు. వైసీపీ నేత దుట్టా రామచంద్రరావు తాను వంశీతో కలిసి పనిచేసేది లేదని, వచ్చే ఎన్నికల్లో తానే పోటీ చేస్తానని చెబుతున్నారు.

## ఏపీకి బీజేపీ జాతీయ నేతలు

విజయవాడ, మే 30, బీజేపీ ఏపీపై దృష్టి సారించిందా.. అన్న ప్రశ్నకు వరుసగా ఆ పార్టీ అగ్రనేతలు రాష్ట్ర పర్యటనకు రానుండటంతో పరిశీలకులు ఔననే అంటున్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలలో పాల్గొనేందుకు ప్రధాని మోడీ జూన్ 4న ఏపీ రానున్నారు. భీమవరంలో జరిగే కార్యక్రమంలో ప్రధాని పాల్గొంటారు. అదే నెల 7న రాజమండ్రిలో బీజేపీ ఆధ్వరంలో జరిగే భారీ బహిరంగ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా హాజరు కానున్నారువచ్చే ఎన్నికలలో తెలుగుదేశం, జనసేనల మధ్య పొత్తుపై రాష్ట్రంలో విస్తృతంగా చర్చ జరుగుతున్న తరుణంలో మోడీ, నడ్డాలు రాష్ట్ర పర్యటనకు రానుండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే బీజేపీ, జన సేన పార్టీల మధ్య పొత్తు ఉన్న నేపథ్యంలో జనసేన తెలుగుదేశంతో జట్టు కడితే బీజేపీ ఏం నిర్ణయం తీసుకోవాలన్నదానిపై పార్టీ నేతలకు మోడీ దిశా నిర్దేశం చేసే అవకాం ఉంది. అలాగే 7న రాజమహేంద్ర వరంలో జరిగే బహిరంగ సభలో పార్టీ జాతీయ అధ్యక్షుడి హోదాలో రాష్ట్రంలో బీజేపీ వచ్చే ఎన్నికలకు సమాయత్తమయ్యే దిశగా నడ్డా పార్టీ శ్రేణులకు పిలుపు మార్గ నిర్దేశనం చేస్తారని భావిస్తున్నారు. ఆత్మకూరు ఉప ఎన్నికల బరిలో బీజేపీ అభ్యర్థి పోటీలో ఉంటారని ప్రకటించడం ద్వారా బీజేపీ రాష్ట్ర రాజకీయాలలో తెలుగుదేశం పార్టీతో మైత్రికి అవకాశం లేదన్న సందేశం ఇచ్చింది. దీనిపై పవన్ కల్యాణ్ ఇంకా స్పందించలేదు. అయితే పొత్తుల విషయంలో నిర్ణయం తీసుకోవలసింది రాష్ట్ర నాయకత్వం కాదనీ, బీజేపీ అధిష్టానమేనని ఆయన పార్టీ అంతర్గత సమావేశాల్లో స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోకుండా చస్తానన్న పవన్ కల్యాణ్ తెలుగుదేశంతో కలిసి పని చేయడంపై బీజేపీ అధిష్టానాన్ని ఒప్పించగలనన్న విశ్వాసం వ్యక్తం చేశారు.రాజధానుల నిర్ణయాన్ని వ్యతిరేకించేలా బీజేపీ అధిష్టానాన్ని తాను ఒప్పించాననీ, అదే రీతిలో రాష్ట్రంలో జగన్ ను అధికారానికి దూరం చేయడం కోసం ఓట్లు చీలకుండా బీజేపీని కూడా పొత్తుకు కలిసి వచ్చేలా ఒప్పించగలనని ధీమా వ్యక్తం చేసినట్లు జనసేన వర్గాలు చెబుతున్నాయి. తెలుగుదేశం, జనసేనల మధ్య ఎన్నికల పొత్తుపై ఇప్పటి వరకూ అధికారిక ప్రకటన వెలువడక పోయినా క్షేత్ర స్థాయిలో జన సేన కార్యకర్తలు తెలుగుదేశంతో కలిసి పని చేస్తున్నారంటే పార్టీ నుంచి వారికి ఆమేరకు స్పష్టమైన సందేశం అంది ఉంటుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో మోడీ రాష్ట్ర పర్యటన రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది.

## రోడ్డున పడ్డ రోల్డ్ గోల్డ్ పరిశ్రమ

విజయవాడ, మే 30, (న్యూస్ పల్స్) బందరు రోల్డ్‌గోల్డ్ పరిశ్రమపై కరోనా సెకండ్ వేవ్ ప్రభావం తీవ్రంగా పడింది. కరోనా నేపథ్యంలో ఏప్రిల్ 25 నుంచి జ్యూయలరీ పార్కుకు పూర్తి స్థాయి లాక్‌డౌన్ ప్రకటించడంతో ఆభరణాల తయారీ నిలిచిపోయింది. వరుసగా రెండో సీజన్లోనూ మూతపడడంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు. తయారీ నిలిచిపోవడంతో 25 వేల మంది పీస్ వర్క్ కార్మికులు ఆదాయాన్ని కోల్పోయి పస్తులుండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.రోల్డ్‌గోల్డ్ ఆభరణాల తయారీ పరిశ్రమకు బందరు పెట్టింది పేరు. బందరులోని పోతేపల్లి ఇమిటేషన్ జ్యూయలరీ పార్కులో, వెలుపలా ఉన్న 340 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా యూనిట్లలో నెలవారీ టర్నోవర్ రూ.20 కోట్లుగా ఉంటుంది. ఇక్కడ తయారైన ఆభరణాలు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ముంబయి, కొల్‌కత్తా, ఢిల్లీ ప్రాంతాలతోపాటు రాష్ట్రంలోని పలు పట్టణాలకు రవాణా అవుతాయి. కరోనా ఫస్ట్‌వేవ్ లాక్‌డౌన్ తర్వాత ఈ పరిశ్రమ టర్నోవర్ సగానికి అంటే రూ.10 కోట్లకు పడిపోయింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో టర్నోవర్ క్రమంగా పెరిగి రూ.15 కోట్లకు చేరింది. పరిశ్రమ కాస్త కోలుకుంటుందనగానే కరోనా సెకండ్ వేవ్ ఉధృతమవడంతో మన రాష్ట్రంతోపాటు దేశంలోని అనేక రాష్ట్రాల్లో కర్ఫ్యూ, మళ్లీ లాక్‌డౌన్ పెట్టడంతో వ్యాపారం మరోసారి కుంటుబడింది. స్థానికంగానూ పాజిటివ్ కేసులు పెరగడంతో ఏప్రిల్ 25వ తేదీ నుంచి రోల్డ్‌గోల్డ్ తయారీదారులు పూర్తిగా తయారీని నిలిపివేసి లాక్‌డౌన్ ప్రకటించారు. వరుసగా రెండేళ్ల నుండి ఆదాయాలు కోల్పోవడంతో పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోయిందని ఆందోళన చెందుతున్నారు. రోల్డ్‌గోల్డ్ పరిశ్రమలో ప్రత్యక్షంగా ఐదు వేల మంది పని చేస్తున్నారు. రాగి తీగలు చుట్టడం, డిజైన్లు అద్దడం, పూసలు ఎక్కించడం, ఎలక్ట్రిక్ ప్లేటింగ్‌తో నగిషీలు చెక్కడం, ప్యాకింగ్ చేయడం తదితర పనులను మరో 25 వేల మంది కార్మికులు చేస్తున్నారు. వీరికి పీస్ వర్కు ప్రాతిపదికన చెల్లింపులు జరుగుతాయి. కిలో ఆభరణాలు తయారు చేసే కార్మికునికి రోజుకు రూ.400 ఆదాయం వచ్చేది. నెల రోజులుగా పనులు లేకపోవడంతో ఆదాయాలు కోల్పోయి వీరంతా పస్తులుండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయినేను, నా కుమారుడు గాజులు తయారు చేస్తాం. జత గాజులకు రూ.1.50 ఇచ్చే వారు. ఒక్కొక్కరికి రోజుకు రూ.350 ఆదాయం వచ్చేది. కంపెనీ మూతపడడంతో పనిలేక ఆదాయం కోల్పోయాం. కుటుంబం గడవడం లేదు. పస్తులతో ఉండాల్సి వస్తోంది. కొంతమంది కార్మికులు కరోనా బారిన పడ్డారు. చికిత్స కోసం అధికంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఉపాధి కోల్పోయిన అసంఘటిత కార్మికులను కేరళ, తమిళనాడు రాష్ట్రాల తరహాలో ప్రభుత్వం ఆరు నెలలపాటు ఆదుకోవాలని వెంకటయ్య కోరుతున్నారు.

# చల్లని కబురు

విశాఖపట్టణం, మే 30,వాతావరణ శాఖ చల్లటి కబురు అందించింది. మాన్‌సూన్ గురించి మంచిమాట చెప్పింది.ఈసారి వానాకాలం కాస్త ముందే రాబోతోంది. తొలకరి జల్లు పలకరించడానికి సిద్ధంగా వుంది. నైరుతి రుతుపవనాలు మూడురోజుల ముందే కేరళను తాకేశాయి. వాతావరణ కేంద్రం ఇచ్చిన ఇండికేషన్స్ ప్రకారం.. జూన్1 నుంచి వర్షాలు పడే అవకాశం వుంది. వారం పదిరోజుల కిందటే అకాల వర్షాలతో దేశం యావత్తూ తడిసి ముద్దయింది. వేసవి తాపం నుంచి కాస్తంత ఉపశమనం దొరికింది. ఇప్పుడు నైరుతి రుతుపవనం కూడా వచ్చెయ్యడంతో.. మళ్లీ వర్షాలు కురవబోతున్నాయి. జూన్ నెల రాకముందే రుతుపవన వానలు పలకరించడంతో గ్రీష్మతాపం నుంచి రిలీఫ్ దొరకబోతోంది. కానీ? ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కారణంగా సాధారణ వర్షాలు మాత్రమే కురిసే వీలుందంటోంది వాతావరణ కేంద్రం.భారత్‌లో రుతుపవనాల ఆగమనం ముందుగా కేరళ నుంచే మొదలవుతుందనే సంగతి తెలిసిందే. జూన్ 1 నుండి రుతుపవనాల కదలికలకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడుతాయని వాతావరణ శాఖ ఆశాభావం వ్యక్తం చేసింది. జూన్-సెప్టెంబర్ మధ్య దేశవ్యాప్తంగా సాదారణ వర్షపాతం నమోదవుతుందని పేర్కొంది. అయితే కేరళ వ్యాప్తంగా భారీ వర్షాలు కురసే అవకాశం ఉందని తెలిపింది.రుతుపవనాల రాకతో కేరళతోపాటు తమిళనాడు, కర్ణాటకలో వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.

# రివర్స్ ఎటాక్ లో చింతమనేని

ఏలూరు, మే 30, తమనేని ప్రభాకర్. దెందులూరు మాజీ ఎమ్మెల్యే. ప్రభాకర్ ఎక్కడుంటే అక్కడ వివాదం అన్నట్టు రాజకీయాలు మారిపోయాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆయన దూకుడే ఆ ప్రచారాన్ని తీసుకొచ్చింది. ప్రస్తుతం అధికార బలం లేకపోయినా అనుచరగణం వెంటే ఉంది. ఈ క్రమంలో చేసిన పనుల వల్ల వరసగా కేసుల్లో కూరుకుపోయారు చింతమనేని. అధికారంలో ఉన్నప్పుడు.. గత ఎన్నికల టైమ్‌లో వైసీపీపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ రాజకీయంగా కాకరేపుతున్నాయి. కేసులంటే భయపడని చింతమనేని.. తాజాగా కొత్తదారి ఎంచుకోవడంతో చర్చగా మారింది. తనకు ప్రాణహాని ఉందని.. తన అనుచరులనూ వేధిస్తున్నారని ఆరోపిస్తూ కోర్టుకు, కేంద్ర హోంశాఖకు, గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు చింతమనేని. 2019 ఎన్నికల తర్వాత తనపై భౌతికంగా దాడులు చేస్తున్నారన్నది చింతమనేని ఆరోపణ. తనతోపాటు ఉన్నవారినీ.. చివరకు తన లాయర్‌ను కూడా ఇబ్బంది పెడుతున్నారని ఫైర్ అవుతున్నారు. ఇప్పుడు తనను చంపేందుకు ప్రయత్నిస్తున్నారని ఏలూరు కోర్టులో ప్రైవేట్ పిటిషన్ వేసేశారు చింతమనేని. ప్రభుత్వ సలహాదారు సజ్జలతోపాటు మాజీ డీజీపీ గౌతంసవాంగ్ తదితర 21 మందిపై ఆ పిటిషన్‌లో ఆరోపణలు చేశారు. నిన్నమొన్నటి వరకు కేసులంటే లెక్కేచేయని చింతమనేని ఇపుడు తన ప్రాణానికి ముప్పుందని గవర్నర్, కేంద్ర హోంశాఖలతోపాటు కోర్టును ఆశ్రయించడమే ఆసక్తి కలిగిస్తోంది. ఈ పరిణామాలు చూసిన వారు చెబుతున్నది ఒక్కటే.. అధికారిపార్టీపై చింతమనేని రివర్స్ అటాక్ మొదలు పెట్టారని. చేతిలో అధికారం ఎలాగూ లేదు. ఇప్పుడు తిరగబడి పోరాడితే పోయేదేం లేదని ఫిక్స్ అయినట్టు కనిపిస్తోంది. ఈ ఆలోచనతోనే వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఫిర్యాదులు మొదలుపెట్టారు చింతమనేని. పైగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఇబ్బంది పెడుతున్నారని స్వరం పెంచారు. ఈ చర్యలతో డీలాపడ్డ కేడర్‌కూ ధైర్యం వస్తుందని లెక్కలు వేస్తున్నారట. దెందులూరులో తాను అమలు చేయబోయే యాక్షన్ ప్లాన్‌కు కేడర్ అంతా ధైర్యంగా సహకరిస్తుందని అభిప్రాయపడుతున్నారట. ఇప్పటికే బాదుడే బాదుడు పేరుతో నియోజకవర్గంలో పర్యటిస్తున్న చింతమనేని ఇకపై ఏం జరిగినా అమీతుమీ తేల్చుకోవాలని అనుకుంటున్నారట. మరి.. చింతమనేని ఎంచుకున్న ఈ మార్గం ఆయనకు ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూడాలి.

# మీసం మెలేసి చెబుతున్నా.. బాలయ్య తాట తీస్తాం

కర్నూలు, మే 30, వైసీపీ చేపట్టిన సామాజిక న్యాయభేరి బస్సు యాత్ర అనంతపురం చేరుకుంది. ఈ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణపై మంత్రి గుమ్మనూరు జయరాం సంచలన వ్యాఖ్యలు చేశారు. గుడిని, గుడిలో లింగాన్ని మింగుతున్నారని బాలకృష్ణ ఆరోపిస్తున్నారని.. ఆయన్ను వచ్చే ఎన్నికల్లో హిందూపురంలో ఓడించి తీరుతామని మంత్రి గుమ్మనూరు జయరాం స్పష్టం చేశారు. మీసం మెలేసి చెబుతున్నా.. బాలయ్య తాట తీస్తామని ఆయన వ్యాఖ్యానించారు. బీసీలంతా కలిసి బాలయ్య పనిపడతారని.. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని మంత్రి గుమ్మనూరు జయరాం జోస్యం చెప్పారు. మరోవైపు మంత్రి జోగి రమేష్ కూడా టీడీపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ సామాజిక న్యాయభేరి సదస్సుకు జనం రావడం లేదని పచ్చ మీడియా కథనాలు వండి వారుస్తోందని.. వాళ్లు కళ్లు పెట్టి చూడాలని మంత్రి జోగి రమేష్ హితవు పలికారు. తమ బీసీలంటే టీడీపీకి అంత చులకన ఎందుకని ప్రశ్నించారు. చంద్రబాబుకు దమ్ముంటే తాను 18 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు మంత్రి పదవులు ఇస్తానని చెప్పగలరా అని సవాల్ విసిరారు. పేదవాళ్లకు పథకాలు ఇవ్వడం తప్పని చంద్రబాబు అంటున్నారని.. జగన్ గెలిస్తే బలహీన వర్గాలు గెలిచినట్లేనని మంత్రి జోగి రమేష్ స్పష్టం చేశారు. జగన్ మేలిమి బంగారం లాంటి వ్యక్తి అని ప్రశంసలు కురిపించారు.

# పేదల స్థలాల్లో అక్రమంగా రాత్రి రాత్రికే నిర్మించిన ప్రహరీ గోడ

కర్నూలుమే 30, కర్నూలు శివార్లో రేణుక ఎల్లమ్మ కాలనీలో సర్వేనెంబర్ 154 లో పేదల స్థలాల్లో అక్రమంగా రాత్రికి రాత్రే ప్రహరి గోడ నిర్మించి , ఎవరు కు?ల్చకుండా మజీద్ పేరుతో ఒక బోర్డు ను హుస్సేన్ అతని కుమారుడు నిలిపారు. ఆ స్థలానికి సంబంధించిన పేదలు వెళ్లి వాళ్లనడుగగా వాళ్ళు మసీదు కు సంబంధించిన స్థలమని చెప్పారు, వెంటనే బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు మరాఠి అనసూయ దగ్గరికి వెళ్లి ఈ విషయాన్ని తెలియజేశారు. ఆమె , ఆ స్థలానికి సంబంధించిన పేదలు స్థలం దగ్గరికి వెళ్లి వారిని అడుగగా కొంతా మంది మహిళలను తీసుకొని వచ్చి దుర్భాషలాడుతూ దాడి చేయించారు. దాడి చేసిన వారిపై కర్నూలు మూడవ పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. ఈనెల 30 పై తేదీ సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని స్పందన లో కూడా ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు పేదల స్థలాల సమస్యలపై పరిశీలించి వారికి తగు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు మరాఠి అనసూయ కోరారు.




# కాళహస్తి బ్యాంకు చోరీ కేసులో మలుపులు

తిరుపతి, మే 30, : తిరుపతి శ్రీకాళహస్తిలోని ఫిన్ కేర్ బ్యాంక్ చోరీ కేసులో మొదటి నుంచి అందరూ అనుకున్నదే జరిగింది. ఇంటి దొంగలే అసలు దొంగలు అని తేల్చారు పోలీసులు. దోపిడీపై ఫిర్యాదు ఇచ్చిన బ్యాంక్ మేనేజర్ స్రవంతినే అసలు దొంగ అని నిర్ధారణకు వచ్చారు పోలీసులు. ఈ చోరీ కేసులో ఇంటి దొంగల పాత్రపై ముందు నుంచీ అనుమానం వ్యక్తం చేస్తున్నారు పోలీసులు బ్రాంచ్ మేనేజర్‌గా అప్రైజర్‌గా కొనసాగుతున్న స్రవంతి ఈ కేసులో అసలు దోషి అని తేల్చారు పోలీసులు. గిల్టు నగలు తాకట్టు పెట్టి బంగారు రుణాలు కాజేసిన స్రవంతి.. ఆడిట్‌లో వ్యవహారం బయటపడుతుందని దొంగతనం డ్రామా ఆడినట్లు పోలీసులు తేల్చారు. ఈ చోరీకి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బ్యాంకు మేనేజర్‌గా ఉన్న స్రవంతి.. గిల్టు నగలు తాకట్టు పెట్టి రుణాలు తీసుకుంది. అయితే, ఈ విషయం ఆడిట్‌లో తెలిసిపోతుందని భయపడిపోయింది. ఈ క్రమంలోనే దొంగతనం ప్లాన్ వేసింది స్రవంతి. చెన్నైకి చెందిన ముగ్గురు యువకులతో కాంట్రాక్ట్ కుదుర్చుకుని బ్యాంకు దోపిడీకి పక్కా ప్లాన్ వేసింది. ఆ ప్లాన్‌ను అమలు చేశారు యువకులు. బ్యాంక్ లాకర్ నుంచి 67 ప్యాకెట్లలోని దాదాపు రెండు కేజీల బంగారం, రూ. 5 లక్షల నగదు ఎత్తుకెళ్లారు దుండగులు. అయితే, తన చేతులు కట్టేసి, అరవకుండా నోటిలో గుడ్డ కుక్కి కత్తితో బెదిరించి చోరీ చేశారని స్రవంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే, స్రవంతి ప్రవర్తనలో తేడా ఉండటంతో.. పోలీసులు ఆమెను ముందు నుంచీ అనుమానిస్తూ వచ్చారు. ఈమేరకు దర్యాప్తు చేయగా.. అసలు విషయాలు రాబట్టారు. ఈ చోరీ కేసులో అసలు నిజాన్ని స్రవంతి నుంచే రాబట్టి రికవరీ చేసే పనిలో ఉన్నారు పోలీసులు. కాగా, గత నాలుగేళ్లుగా ఫిన్ కేర్ బ్యాంక్‌లో పని చేస్తున్న స్రవంతి.. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే తాను పని చేస్తున్న బ్యాంక్‌కు కన్నం వేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న స్రవంతి సహా, చోరీకి పాల్పడ్డ దుండుగలను మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

# సి ఐ టి యు 52వ ఆవిర్భావ దినోత్సవ పతాకావిష్కరణ




కల్లూరు మే 30 –: కర్నూలు నగరంలోని కల్లూరుఇండస్ట్రియల్ ఎస్టేట్ లోని హమాలి యూనియన్ ఆఫీస్ దగ్గర గల సి ఐ టి యు పతాకాన్ని ఉదయం 10 గంటలకు సిఐటియు జిల్లా నాయకులు యం.గోపాల్ ఆవిష్కరించారు .అనంతరం ఇండస్ట్రియల్ ఎస్టేట్ సిఐటియు నాయకులు సిహెచ్ సాయిబాబా అధ్యక్షతన జరిగిన ఆవిర్భావ సభలో గోపాల్ సుధాకరప్ప మాట్లాడుతూ సంపద సృష్టి కర్త లయిన శ్రామిక వర్గం , ఈ పెట్టుబడిదారీ సమాజంలో సరైన వేతనాలు లేక భద్రత లేక, చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెట్టుబడిదారీ వర్గం తీవ్రమైన శ్రమదోపిడి చేస్తూ ,సమాజ .పురోగమనానికి , ఎంతో ఉపయోగపడే కార్మిక వర్గానికి ఎలాంటి హక్కులు లేకుండా. వేతన జీవులు గా మార్చి వేశారని అన్నారు .అందుకే కార్మిక రాజ్య స్థాపన, సమసమాజము ద్వారానే శ్రామిక వర్గం సుఖవంతమైన జీవితం గడుపు తుందని, ,భావించి , సి ఐ టి యు 1970 మే 30న ఆవిర్భవించిందని సిఐటియు నాయకులు తెలియజేశారు. సి ఐ టి యు ఏర్పడిన నాటి నుండి దేశంలోని అనేక కోట్ల మందిని సంఘాలలో ఇముడ్చుకొని సమస్యలపై మిలిటెంట్ పోరాటాలు నిర్వహించి అనేక విజయాలు సాధించిందని తెలియజేశారు. ఐక్యత ,పోరాటం అనే నినాదంతో, దేశంలోని అన్ని ట్రేడ్ యూనియన్ లను కలుపుకొని సుదీర్ఘమైన పోరాటాలు సమ్మెలు, నిర్వహించిందని తెలిపారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులను బానిసలుగా మార్చివేస్తున్న దన్నారు . కోట్లాది మంది కార్మికులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయ కుండా, నరేంద్ర మోడీ కార్మికులపై కక్షగట్టి వ్యవహరిస్తున్నారని అన్నారు. రానున్న కాలంలో కార్మికులు మరింత చైతన్యవంతులుగా ప్రభుత్వ విధానాలపై పోరాదాలని పిలుపిచ్చారు. సి ఐ టి యు రానున్న కాలంలో దేశంలోని అన్ని ప్రధాన కార్మిక సంఘాలను కలుపుకొని కార్మికుల హక్కుల కోసం మాత్రమే కాకుండా , ధరల పెరుగుదల మోడీ మతోన్మాద చర్యలపై కూడా , పోరాడుతుందని అన్నారు . రాష్ట్రంలో వైఎస్సార్ ప్రభుత్వం కూడా కార్మికులకు వ్యతిరేకంగా నరేంద్ర మోడీ తెచ్చిన చట్టాలను సమర్థిస్తూ నరేంద్ర మోడీ కి తోకగా మారారని విమర్శించారు. ధరలు విపరీతంగా పెంచుతున్న కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల వేతనాలు ,కార్మికుల జీతాలు ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని , ఇది సామాజిక అసమానతలకు దారి తీస్తుందని అన్నారు. ఐక్య పోరాటాలు మాత్రమే సమాజంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థల కార్మికుల, పారిశ్రామిక కార్మికుల ఇతర సామాజిక తరగతుల కార్మికుల,హక్కులకు బాసటగా నిలబడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సి ఐ టి యు నగర నాయకులు కే సుధాకరప్ప, జి ఏసు. ఇండస్ట్రీ ఎస్టేట్లోని ఎస్టేట్ హమాలీలు ఏపీ సీడ్స్ కార్మికులు పాలిష్ అండ్ గ్రానైట్ ఫ్యాక్టరీ కార్మికులు, బండ్ల సంఘం కార్మికులు పాల్గొన్నారు.

# అప్పుడు పీవీ... ఇప్పుడు ఎన్టీఆర్

## గులాబీ బాస్ నయా ప్లాన్

హైదరాబాద్, మే 30, (న్యూస్ పల్స్)తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరు తారక రామ రావు జయంతి 1923 మే 23 న జన్మిచిన ఎన్టీఅర్, 1996 జనవరి 18 కన్ను మూశారు. అప్పటి నుంచి తెలుగు దేశం పార్టీ, హైదరాబాద్'లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద ప్రతి సంవత్సరం ఎన్టీఅర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం కూడా, తెలంగాణ తెలుగు దేశం పార్టీ ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహిస్తోంది. అయితే, ఈ సంవత్సరం వేడుకలకు ఒక ప్రత్యేకత వుంది. కేసీఆర్ ఎన్టీఆర్ ను ఘనంగా కీర్తించడం...ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ముఖ్యంగా తెరాస వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది. అయితే, కేసీఆర్ ఏది చేసినా, ఉచితంగా చేయరు. ప్రయోజనం లేదనుకుంటే మహాత్ముల జయంతి వర్ధంతి వేడుకలనే స్కిప్ చేస్తారు. అలాగే, కేసీఆర్ అనూహ్యంగా ఒక అడుగు వేశారంటే దాని వెనక ఒక రాజకీయ వ్యూహం, ఎత్తుగడ ఉండి తీరతాయి, అనే విషయంలో ఎవరికీ అనుమానం లేదని, అదే విధంగా ఈ నిర్ణయం వెంక కూడా ఎదో వ్యూహం ఉండే ఉంటుందని, పరిశీలకు భావిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనే కేసీఆర్, అవసరం అయితే బొంత పురుగును అయినా ముద్దాడతానని ప్రకటించారు. ఇంకొక సందర్భంలో తెలంగాణలో స్థిరపడిన అంద్రోళ్ళ ఓట్ల కోసం, అంద్రోళ్ళ కాలిలో ముళ్ళు దిగితే, తన పంటితో తీస్తానని నమ్మ పలికారు. అంటే అవసరం అయితే, ఎవరిని అయినా సొంతం చేసుకునేదుకు, కేసీఆర్ ఎప్పుడు సిద్దంగా ఉంటారని వేరే చెప్ప నక్కరలేదని అంటారు. అలాగే, అవసరం తీరన తర్వాత అంతే, 'ప్రేమ' గా బయటకు గేన్తెస్తారని కూడా అంటారు అనుకోండి, అది వేరే విషయం. ఇక ఇప్పుడు, ముందస్తు ఎన్నికలకువెళ్ళే ఆలోచనలో ఉన్న కేసీఆర్, అటు ఆంద్ర ఆరిజిన్ ఓటర్లను, ఇటు తెలుగు దేశం పార్టీ నాయకులు, క్యాడర్'ను బుట్టలో వేసుకునేందుకే ఎప్పుడు లేని విధంగా ఇప్పడు ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో పాల్గొంటున్నారనే చర్చ రాజకీయ వర్గాలో జరుగుతోంది. తెలంగాణలో తెలుగు దేశం పార్టీ అంత బలంగా లేక పోయినా, పార్టీకి సుశిక్షితులైన కార్యకర్తలు, బలమైన నాయకులు ఉన్నారు. నిజానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, కేసీఆర్ మంత్రి వర్గంలో సగం మందికి పైగా మంత్రులు అంతా ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు సిశిక్షణలో నాయకులుగా ఎదిగిన మాజే టీడీపీ నాయకులే ఉన్నారు. అన్నిటినీ మించి బీసీల గుండెల్లో ఈనాటికీ ఎన్టీఅర్ బొమ్మ పదిలంగా వుంది, అందుకే, తెలుగు దేశం పార్టీ నాయకుల నుంచి క్యాడర్, ఓటర్ల వరకు అందరినీ తమ వైపుకు తిప్పుకునే ఎత్తుగడలోభాగంగానే కేసీఆర్, ఎన్టీఆర్ జయంతిని వినియోగించుకునే వ్యూహంతో ఉన్నారని అంటున్నారు. నిజానికి, పార్టీలతో సంబంధం లేకుండా పనికొచ్చే, 'పెద్ద' లను సొంతం చేసుకోవడం కేసీఆర్ 'కు కొత్త కాదని అంటున్నారు. జాతీయ స్థాయిలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన తెలంగాణ ముద్దు బిడ్డ, మాజీ ప్రధాని పీవీ నరసింహ రావు శత జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించి పీవీ కుటుంబాన్ని, పీవీ సామాజిక వర్గాన్ని తమ వైపుకు తిప్పుకున్న చరిత్రను గుర్తు చేస్తున్నారు. పీవీని సొంతం చేస్కోవడమే కాకుండా దుబ్బాక, హుజురాబాద్, జీహెచ్ఎంసీ వరస ఓటముల క్రమంలో వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికలో, పీవీ కుమార్తె, సురభి వాణీ దేవికి టికెట్ ఇచ్చి గెలిపించుకున్నారు. సో.. ఇప్పుడు ఎన్టీఅర్ జయంతి వేడుకల్లో గులాబీ నేతలు పాల్గొనడం కూడా పెద్దాయన మీద ఉన్న గౌరవంతోనో, భక్తితోనో కాదు, రాజకీయ అవసరం కోసమే అంటున్నారు. ఆయన అప్పుడు, పీవీని సొంతం చేసుకున్నారు. ఇప్పుడు ఎన్టీఅర్'ను సొంతం చేసుకుంటున్నారు. అదే కేసీఆర్ జాతిపిత మహాత్మా గాంధీ, రాజకీయ నిర్మాత బీఆర్ అంబేద్కర్, జయంతి, వర్ధంతి వేడుకలకే ఈ నాడు హాజరు కాని, గులాబీ నేతలు ఎన్టీఅర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అంటే..ఆయన ఎంతటి రాజకీయ చతురుడో వేరే చెప్పనక్కరలేదు. అదే సమయంలో ఆయన్ని ఎన్నికల ఓటమి భయం ఎంతగా వెంతాడుతోందో కూడా .. తెలియచేస్తుందని, పరిశీలకులు అంటున్నారు.

## జూలైలో మరోసారి సంక్షోభం..

# నైరుతితో బొగ్గు సరఫరాకు బ్రేక్

## థర్మల్ ప్లాంట్లలో తక్కువ బొగ్గు నిల్వలు

## విద్యుదుత్పత్తి తగ్గే ఛాన్స్: సీఆర్ఈఏ



న్యూఢిల్లీ, మే 29: జూలై–ఆగస్టు నెలల్లో దేశం మరోసారి విద్యుత్తు సంక్షోభాన్ని ఎదుర్కోనున్నదని సెంటర్ ఫర్ రిసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) నివేదిక హెచ్చరించింది. థర్మల్ ప్లాంట్లలో బొగ్గు నిల్వలు ఇప్పటికే చాలా తక్కువగా ఉన్నాయని, నైరుతి వర్షాల కారణంగా బొగ్గు సరఫరాకు అంతరాయం కలిగి విద్యుత్తు సంక్షోభం ఏర్పడుతుందని వివరించింది. అన్ని థర్మల్ కేంద్రాల్లో కలిపి 20.7 మిలియన్ టన్నుల బొగ్గు మాత్రమే నిల్వ ఉన్న విషయాన్ని గుర్తు చేసింది. 'దేశంలో ఏమాత్రం విద్యుత్తు వినియోగం పెరిగినా థర్మల్ కేంద్రాలు భరించే స్థితిలో లేవు' అని సీఆర్ఈఏ తన నివేదికలో పేర్కొన్నది. దేశంలో బొగ్గు ఉత్పత్తికి లోటు లేదని సీఆర్ఈఏ తన నివేదికలో తెలిపింది.

# ప్రజలకు ఇచ్చిన ప్రతీ మాటను నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నాం...

## ప్రతి కాలనీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

## గోపనపల్లి తండా లో గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి బస్తీబాట



శేరిలింగంపల్లి మే 30 –:శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలో గోపనపల్లి తండా లో ప్రజా సమస్యలపై బస్తీ బాట లో భాగంగా కాలనీలో సమస్యల గురించి గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ప్రజలను ఆరా తీశారు . అనంతరం కాలనీ లో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ కి గోపనపల్లి తండా కాలనీ వాసులు తీసుకువచ్చారు. ఇందులో భాగంగా కాలనీ లో మంచి నీళ్లు, డ్రైనేజి, సీసీ రోడ్డులు, వీధి దీపాల పనితీరుపై తనిఖీ చేశారు. జి.హెచ్.ఎం.సి అధికారులతో మాట్లాడుతూ డ్రైనేజి, సిసి రోడ్లు, మంచి నీళ్లు, మురికి కాలువల పనుల గురించి చర్చించారు. తదనంతరం గోపన్ పల్లి తండా లో నూతనంగా నిర్మిస్తున్న భుగర్భ డ్రైనేజీ పైప్ లైన్ పనులను, కాలనీ వాసులతో కలిసి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పరిశీలించారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చే దిశగా పని చేస్తున్నామన్నారు. గచ్చిబౌలి డివిజన్ లోని ప్రతీ కాలనీ, బస్తీల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతీ మాటను నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని,డివిజన్ పరిధిలో మంజూరైన అభివృధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేల కృషి చేస్తామని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తెలిపారు . నాణ్యత విషయంలో ఎక్కడా కూడా రాజీ పడకుండా నిర్ణీత సమయంలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేయాలని కార్పొరేటర్ ఆదేశించారు. వర్షపు నీరు, మురుగు నీరు, ఎక్కడ కూడా నిలవకుండా చూస్తామని అన్నారు. ప్రజలకు మేలైన మౌలిక వసతుల కల్పనకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ్ , రంగారెడ్డి జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హనుమంతు నాయక్ , సీనియర్ నాయకులు కైలాష్ సింగ్, ముళగిరి శ్రీనివాస్ , ప్రభాకర్,శేఖర్,మన్నే రమేష్,నర్సింగ్ నాయక్ ,దేవేందర్ ,వేణు ,నరేందర్ గోపనపల్లి తండా వాసులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

## – పోలీస్ స్టేషన్ కు వచ్చే దరఖాస్తు దారుల పట్ల మర్యాదగ ఉండాలి

## – పెద్దపల్లి ఇంచార్జ్ డీసీపీ అఖిల్ మహాజన్

పెద్దపల్లి పెద్దపల్లి జిల్లా గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ను పెద్దపల్లి ఇంచార్జ్ డీసీపీ అఖిల్ మహాజన్ గోదావరిఖని ఏసీపీ గిరి ప్రసాద్ తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం నూతన భవన ను పరిశీలించడం జరిగింది. అలాగే నేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణ గురించి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏసిపి గిరిప్రసాద్ తెలిపారు. సిబ్బందితో మాట్లాడి పోలీస్ స్టేషన్లో 5బ ఇంప్లిమెంటేషన్, వర్టికల్స్ విధానాన్ని అమలు చేయాలని, బ్లూ కోట్ విధులు,పెట్రో కార్ యొక్క విధులు, పిటిషన్ మేనేజ్–మెంట్ మరియు పోలీస్ స్టేషన్ యొక్క పనితిరును రిసెప్షన్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. క్రైమ్ వెహికల్స్, అబండెడ్ వెహికల్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చే వారితో మర్యాదగా మెలాగలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగుండా గ్రామాల్లో గస్తీ పెంచాలన్నారు. అదేవిధంగా పాత నెరగాళ్లపై నిఘా ఉంచాలని, 100 డయల్ ఫిర్యాదుల పట్ల వేగవంతమైన స్పందన ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో బిట్లు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాలను నియంత్రణ చెయ్యాలని అన్నారు. సైబర్ నేరాలపై రోడ్డు భద్రత నియమలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ తమ తమ విధులు క్రమశిక్షణతో నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ గిరి ప్రసాద్, సీఐలు గంగాధర రమేష్ బాబు, రాజ్ కుమార్ గౌడ్, ఎస్సైలు నరేష్, సుబ్బారావు, స్వామి, శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

# మామిడి ధర...పుల్లనా...

హైదరాబాద్, మే 30 (న్యూస్ పల్స్) అందరిని తీపి ఫలాలను అందించే మామిడి రైతులకు మార్కెట్‌లో ఉన్న ధరలు చేదును మిగిలిస్తున్నాయి. వరుసగా మూడో ఏడాది సైతం మామిడి రైతులకు నష్టాలు తప్పడం లేదు. సీజన్? ప్రారంభంలో టన్ను మామిడి ధర రూ. లక్షకు పైగా పలుకగా ప్రస్తుతం టన్ను మామిడి ధర రూ. 28 వేల నుంచి రూ. 35వేల లోపు పలుకుతుంది. ఇప్పటికే ఈఏడాది దిగుబడి తగ్గిందని భావిస్తున్న మామిడి రైతులకు తగ్గిన ధర మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు ఉంది. మామిడి రైతులు వరుసగా మూడో ఏడాది సైతం కష్టాలను నష్టాలను ఎదుర్కొంటున్నారు. కరోనా సమయంలో గడిచిన రెండు సంవత్సరాలు లాక్?డౌన్?ఉండటంతో రైతులు పండిన పంటను అమ్ముకొలేని పరిస్థితి.. ఈ ఏడాది కరోనా కంటికి కనిపించకుండ పోవడంతో మామిడి రైతులకు మంచి రోజులు ఉంటాయని అందరు భావించారు. అయితే సీజన్? ప్రారంభంలో మామిడికి మంచి ధరలు రావడంతో రైతులు కష్టాలు తీరినట్లే భావించారు. సీజన్? ప్రారంభంలో టన్ను మామిడి ధర రూ. లక్ష నుంచి రూ. లక్ష 20వేల వరకు పలికింది. రాను రాను మార్కెట్?లో ధర తగ్గి ప్రస్తుతం టన్ను మామిడి ధర రూ. 28వేలు, రూ. 40వేల వరకు పలుకుతుంది. గతేడాదితో పొల్చుకుంటే ఈ ఏడాది మామిడి దిగుబడి ఘననీయంగా తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడికి పూత దశలోనే చీడపీడలు రావడంతో పూత కాపాడుకునే ప్రయత్నంలో రైతులు పురుగు మందులు పిచ్చికారి చేసినా అనుకున్న స్థాయి దిగుబడి రాలేదు. గతేడాది ఎకరాకు 8 నుంచి 10 టన్నుల దిగుబడి రాగా ఏడాది ఎకరాకు 5 టన్నులకు మించి దిగుబడి రాలేదు.

# కార్మిక హక్కులను కాలరాస్తున్న బిజెపి విధానాలపై పోరాటాలకు సిద్ధం కండి -: సిఐటియు



కర్నూలు మే 30 -: ప్రాణ త్యాగాల తో సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాశి కార్మికులకు నష్టదాయకమైన 4 లేబర్ కోడ్లను తీసుకువచ్చిన బిజెపి ప్రభుత్వం విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని అసంఘటిత రంగ కార్మిక లైన ఆటో కార్మికులకు సమగ్ర చట్టం తేవాలని ఖ.ఈ ,ఇూఎ,పెన్షన్, సంక్షేమ పథకాలు అమలుకై పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ న్యూ సిటీ నగర ప్రధాన కార్యదర్శి బి.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్( సి ఐ టి యు) 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సి. క్యాంప్ సెంటర్, బళ్లారి చౌరస్తా లోని ఆటో స్టాండ్ లో సిఐటియు జెండాలను ఎగరవేశారుఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు సి ఐ టి యు ఆటో యూనియన్ న్యూ సిటీ నగర ఉపాధ్యక్షులు ఎస్,మాలిక్ బాషా, హుస్సేన్ వలి. అధ్యక్షతన జరిగిన జెండా ఆవిష్కరణ ముఖ్య అతిథులుగా ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.ప్రభాకర్ ఆటో యూనియన్ న్యూ సిటీ నగర ప్రధాన కార్యదర్శి బి.రాధాకృష్ణ పాల్గొని జెండా ఆవిష్కరించారు అనంతరం ఆటో కార్మికులు ఉద్దేశించి వారు మాట్లాడుతూ. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ సిఐటియు సంఘం మే 30. 1970 సంవత్సరంలో ఆవిర్భవించిందని కార్మిక రాజ్యం ఏర్పాటు చేయడమే సిఐటియు లక్ష్యంగా పెట్టుకుందని వారన్నారు. ఎఫ్ సి లేట్ ఫీజు పై పెద్ద ఎత్తున సిఐటియు పోరాటం నిర్వహించి ఆటో కార్మికులకు అండగా నిలిచిందని వారు గుర్తు చేశారు. కార్మిక కర్షక ఉద్యోగ ఉపాధ్యాయుల ఐక్యత కొరకు నిరంతరం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని ఆటో డ్రైవర్లపై అనునిత్యం ఆర్టీఏ ట్రాఫిక్ ఆర్టీసీ అధికారులు చేస్తున్న దాడులు ఆపాలని ఆటో డ్రైవర్లకు నష్టదాయకమైన జీవో 21 రద్దు చేయాలని పెట్రోల్ డీజిల్ జీఎస్టీ పరిధిలోకి తేవాలని పెరిగిన ధరలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. అతిుజ.ఆవిర్భవించినప్పటి నుండి కార్మికుల ఉపాధి పైన జీతభత్యాల పైన హక్కులపైన రాజీలేని పోరాటం చేసి కార్మికులను ఐక్యం చేస్తూ కార్మికులకు న్యాయం జరిగేంత వరకు పోరాటాలు చేసిందని ఉద్యోగ కార్మికుల కోసం అసంఘటిత కార్మికుల కోసం అనేక పోరాటాలు నిర్వహించిందని పెట్టుబడిదారీవిధానం అంతం కార్మిక రాజ్య స్థాపనే ధ్యేయంగా సిఐటియు పనిచేస్తుందని వారు అన్నారు సిఐటియుచేసే పోరాటంలో కార్మికులంతా పాల్గొని కార్మికుల ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు ఆటో డ్రైవర్లు అందరూ కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఆటో యూనియన్ నగర్ నాయకులు శిఖామణి, బి టి ఆర్ నగర్ ,మాలిక్.మధు,ఎెప్త్రజీజీబతిఎిచిన్న మద్దిలేటి, శీను, నారాయణ.. సుదర్శన్ రెడ్డి, మరియు యు.వి మంది ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## కర్నూలు వైకాపా కార్యాలయంలో ఘనంగా వేడుకలు

కర్నూలు మ్రే 30 -: అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా కర్నూలు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు...ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్ మోహన్ రెడ్డి మూడేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం రోజు కర్నూలు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత మహానేత డాక్టర్.వైఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు, అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు...పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి , కర్నూలు నగర ఎమ్మెల్యే ఎం.ఏ.హఫీజ్ ఖాన్ ,కోడుమూరు ఎమ్మెల్యే జె.సుధాకర్ బాబు ,పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ,కర్నూలు నగర మేయర్ బి.వై.రామయ్య ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు...ఈ కార్యక్రమంలో కర్నూలు నగరంలోని, రాష్ట్ర, జిల్లా వైయస్ఆర్ సిపి నాయకులు,కార్యకర్తలు,పలువురు డైరెక్టర్లు, చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు...

# నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించకపోతే దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపడతాం

### వామపక్ష నేతల హెచ్చరిక



కర్నూలు మే 30 -:పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ మరియు నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించకపోతే దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని సిపిఎం పార్టీ కర్నూలు జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సిపిఐ కర్నూలు జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి నరసింలు, ాజఅఅఎ (అ) నాయకులు నాగన్న హెచ్చరించారు. పెట్రోల్, డీజిల్ వంట గ్యాస్ ధరలను అదుపు చేయాలని నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం రోజు కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం నగర కార్యదర్శి రాజశేఖర్, సిపిఐ నగర నాయకులు చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వామపక్ష నేతలు మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో పేద మద్దతులది ప్రజల పైన భారాలేయడమే పనిగా పెట్టుకున్నాడని వారు విమర్శించారు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం వల్ల భారత ప్రజల నుండి 14 లక్షల కోట్ల రూపాయలు భారం వేసి కార్పొరేట్ శక్తులకు 4 లక్షల 75 వేల కోట్ల రూపాయలు రాయితీలు ప్రకటించడం, రుణాలు మాఫీ చేయడం, సబ్సిడీలు ఇవ్వడం దుర్మార్గమైన చర్యని వారు విమర్శించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కోట్లు గడించడం కొరకే అధికారంలోకి వచ్చిందని పేద మధ్యతరగతి ప్రజలు ఈ ప్రభుత్వానికి అవసరం లేదని వారు తెలిపారు. ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం పేద ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే తాను అధికారంలో రాకమందు నేను ధరలు అదుపులో పెడతాను, పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గిస్తాను, వంట గ్యాస్ ధరను 300 కి ఇస్తాను అని చెప్పిన మాటలన్నీ గాలికి వదిలేసి ప్రజలపై భారాలు వేయడమే తన పనిగా పెట్టుకున్నాడని వారు విమర్శించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి కూడా తానేమి తక్కువ తినలేదని ఈయన అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు చార్జీలు బస్సు చార్జీలు ఇంటి పన్నులు నీటి పన్నులు చెత్త పనులు పెంచి పట్టణ ప్రజల పైన రాష్ట్ర పేద ప్రజల పైన మోయలేని భారాన్ని వేశాడని వారు తెలిపారు. మడమతిప్పను మాట తప్పను అన్న ముఖ్యమంత్రి మాట తప్పడు మడమ తిప్పాడు అని వారు ఘాటుగా విమర్శించారు. 300 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తాను అని చెప్పిన ముఖ్యమంత్రి 300 యూనిట్లు కాదు కదా పది యూనిట్లు కూడా ఉచితంగా ఇవ్వలేదని, సర్చార్జీల పేరుతో ప్రజల నడ్డి విరగొడుతున్నాడని వారు తెలిపారు. గతంలో చంద్రబాబు నాయుడు విమర్శించిన జగన్మోహన్ రెడ్డి వ్యాట్ పెంచి నిత్యవసర వస్తువుల ధరలు పెరగడానికి కారణమయ్యాడని వారు తెలిపారు. ఈ ప్రభుత్వాలు పేదల పక్షాన నిలబడే ప్రభుత్వాలు కాదని అది ఉన్న వాళ్ళ కోసం, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయడం కోసం ఉన్న ప్రభుత్వాలని ఈ ప్రభుత్వాలు వ్యతిరేకంగా ప్రజల సమీకరించి పోరాటం చేయడమే మార్గమని అందుకోసం ప్రజలు ఈ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం అవ్వాలని వారు పిలుపునిచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకురాలు నిర్మల డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామన్న ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సిపిఎం నాయకులు రాముడు అంజిబాబు షరీఫ్ విజయ్ అబ్దుల్లా సిపిఐ నాయకులు జగన్నాథం రామకృష్ణారెడ్డి హరీష్ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా డిఆర్ఓ కి వినతి పత్రాన్ని ఇచ్చారు.

## ఉమ్మడి కర్నూలు జిల్లాలో 16 మంది చిన్నారులకు పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ పథకం వర్తింపు



### -: కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ రామ సుందర్ రెడ్డి

### పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ ఫండ్ ను పంపిణీ చేసిన జేసీ ఎమ్మెల్యేలు, మేయర్

కర్నూలు మే 30 , 2022 :- కరోనా మహమ్మారి ఎంతో మంది జీవితాల్లో తీవ్ర విషాదాన్ని నింపిందని తల్లిదండ్రులకు పిల్లలను, పిల్లలకు తల్లిదండ్రులను దూరం చేసిందని అంతటి దైన్య స్థితిలో ఎంతో మంది చిన్నారులు జీవితంలో ఎంతో ధైర్యంగా నిలబడ్డారని వారందరికీ కేంద్ర ప్రభుత్వం సాయం చేస్తోందని వారిని అన్ని విధాలా ఆదుకుంటామని ప్రధాని నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. కోవిడ్ కారణంగా అనాథలుగా మారిన చిన్నారులను ఆదుకునేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ పథకం నిధులు సోమవారం ఉదయం పదిన్నర గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ లోని ఔఎఅ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ రామ సుందర్ రెడ్డి, పాణ్యం , కర్నూలు , కోడుమూరు, పత్తికొండ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హాఫీజ్ ఖాన్, డా. సుధాకర్ , కంగాటి శ్రీదేవి, కర్నూలు నగర మేయర్ బి.వై. రామయ్య, ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కే.ఎల్.ఆర్.కే.కుమారి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 16 మంది చిన్నారులు కోవిడ్ కారణంగా అనాథలుగా మిగిలారని, ఈ చిన్నారులను ఆదుకునేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ పథకం కింద నిధులు పొందేందుకు వీరు అర్హులయ్యారని తెలిపారు.. ఈ పథకం కింద పిల్లలకు 18 ఏళ్ల వయస్సు నుంచి నెలసరి స్టైఫండ్ అందించడంతోపాటు 23 ఏళ్ల వయసు వచ్చే సరికి దాదాపు పది లక్షల రూపాయల మొత్తాన్ని అందించడం జరుగుతుందని జేసీ తెలిపారు. ఉన్నత విద్య కోసం విద్యారుణం మంజూరు చేస్తే, సీఎం కేర్స్ ఫండ్ నుంచి రుణాలకు వడ్డీ చెల్లింపు, ఆయుష్మాన్ భారత్ కింద ఉచితంగా రూ 5 లక్షలు హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం కూడా చెల్లింపు చేయడం జరుగుతుందని జేసీ వివరించారు.

### బలవంతపు మతమార్పిడిపై బీజేపీ ఆరోపణలు అర్ధరహితం : చిదంబరం

న్యూఢిల్లీ : తమిళనాడులో బలవంతపు మత మార్పిడిపై బీజేపీ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం తోసిపుచ్చారు. రాజ్యసభ సీటుకు నామినేషన్ దాఖలు చేసిన అనంతరం చిదంబరం సోమవారం విలేకరులతో మాట్లాడారు. తాను ఒకటో తరగతి నుంచి కాలేజ్ వరకూ క్రైస్తవ విద్యా సంస్థల్లో చదివానని, కాషాయ పార్టీ చేస్తున్న బలవంతపు మతమార్పిడుల ఆరోపణలు హేయం, అసత్యాలని స్పష్టం చేశారు.తమిళనాడులోని తంజావూరు క్రైస్తవ పాఠశాలలో బాలిక మృతి నేపధ్యంలో బీజేపీ తమిళనాడు శాఖ ఈ ఆరోపణలను ముందుకు తెచ్చింది. తమిళనాడులో బలవంతపు మతమార్పిడి జరుగుతోందని బీజేపీ రాష్ట్ర చీఫ్ అన్నామలై ఆరోపించారు.

# బాలీవుడ్ బంపర్ ఆఫర్..అంతలోనే..



'మాస్టర్' బ్యూటీ మాళవికా మోహనన్ కు బాలీవుడ్ లో బంపర్ ఆఫర్ తగిలిందా? .. గత కొంత కాలంగా బాలీవుడ్ లో క్రేజీ ఆఫర్ ని సొంతం చేసుకుని బాలీవుడ్ లో పాగావేయాలని ప్రయత్నాలు చేస్తున్న ఆమెకు ఏకంగా బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ నుంచి బంపర్ ఆఫర్ తగిలిందా? అంటే నిజమంటూ కొంత మంది నెట్టింట ప్రచారం మొదలు పెట్టారు. వివరాల్లోకి వెళితే.. సల్మాన్ ఖాన్ హీరో నటిస్తున్న తాజా బాలీవుడ్ మూవీ 'కభీ ఈద్ కబీ దివాళీ'.ఫర్హాద్ సమ్జి దర్శకత్వం వహిస్తున్నారు. తమిళ బ్లాక్ బస్టర్ హిట్ ఫిల్మ్ 'వీరం' ఆధారంగా ఈ చిత్రాన్ని రీమేక్ చేస్తున్నారు. బాలీవుడ్ లో చాలా వరకు మార్పులు చేసి ఈ మూవీని రూపొందిస్తున్నారు. కథా విస్తరణ బాలీవుడ్ నిర్మాత సాజిద్ నదియావాలా చేయగా సల్మాన్ ఖాన్ నటిస్తూ ఈ మూవీని నిర్మిస్తున్నారు. పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీలోని కీలక పాత్రలో విక్టరీ వెంకటేష్ నటిస్తున్నారు. విలన్ గా జగపతిబాబు కనిపించబోతున్నారు.జగ్గూ భాయ్ కిది హిందీలో ఎంట్రీ మూవీ. ఇటీవలే రెగ్యులర్ షూటింగ్ మొదలైన ఈ మూవీని ఈ ఏడాది డిసెంబర్ 30కి ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇప్పటికే డేట్ ని కూడా ప్రకటించేసింది చిత్ర బృందం.ఇదిలా వుంటే ఈ మూవీలో 'మాస్టర్' బ్యూటీ మాళవిక మోహనన్ నటిస్తోందంటూ వార్తలు షికారు చేస్తున్నాయి. సినిమాలో సల్మాన్ ఖాన్ పాత్రకు సోదరుడిగా సిద్ధార్థ్ నిగమ్ నటిస్తున్నాడు. అతనికి జోడీగా మాళవిక మోహనన్ని ఎంపిక చేశారంటూ ప్రచారం మొదలైంది.అయితే ఈ ప్రాచారంలో నిజం లేదని ఇదంతా ఫేక్ న్యూస్ అని కొట్టిపారేసింది మాళవిక. సల్మాన్ ఖాన్ నటిస్తున్న 'కబీ ఈద్ కబీ దివాళీ' మూవీతో తాను నటించడం లేదని మాళవిక క్లారిటీ ఇచ్చింది. ఇదిలా వుంటే ఇదే ఏడాది మాళవిక మోహనన్ బాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం కాబోతోంది. సిద్ధాంత్ చతుర్వేది హీరోగా రితేష్ సిద్వానీ ఫర్హాన్ అక్తర్ నిర్మిస్తున్న 'యుద్రా' మూవీతో బాలీవుడ్ కు హీరోయిన్ గా పరిచయం కాబోతోంది. చిత్రీకరణ దశలో వున్న ఈ మూవీ త్వరలో విడుదల కాబోతోంది. ఇక ఇదే ఏడాది మాళవిక టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అవుతున్న విషయం తెలిసిందే. గతంలో 'హీరో' మూవీతో విజయ్ దేవరకొండతో కలిసి పరిచయం కావాల్సిన మాళవిక మోహనన్ త్వరలో మారుతి డైరెక్షన్ లో ప్రభాస్ హీరోగా తెరపైకి రానున్న మూవీతో తెలుగు తెరకు పరిచయం కాబోతోంది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే దర్శకుడు మారుతి వెల్లడించనున్నారు.

# అందం అమ్మాయయితే నీలా ఉంటుందా?

"అందం అమ్మాయయితే నీలా ఉందా? అన్నట్టుందే మొమాటాలే వద్దన్నాయే! అడగాలంటే కౌగిలే.. ఉండిపోరాదే..గుండె నీదేలే..హత్తుకోరాదే గుండెకే నన్నే" అని పాటేసుకోవాల్సిందే. అవును హెగ్డే పూజా అందం ఆ రేంజ్ లో ఉంది మరి. అమ్మడి అందానికి ఫిదా అవాల్సిందే. అందానికి అందం అని



కవులు వర్ణించిన కవితలు అందుకోవాల్సిందే.డిజైనర్ దుస్తులు పూజాహెగ్డే అందాన్ని మరింత హైలైట్ చేస్తున్నాయి. ముఖానికి లైట్ మ్యాకప్..ఆ చిలిపి పెదవులు.. మెడలో డ్రెస్ మ్యాచింగ్ దట్టమైన రింగ్...కాస్ట్యూమ్స్ ప్రతీది హెగ్డే పూజా అందాన్ని మరింత ఫోకస్ చేస్తున్నాయి. అందమైన అమ్మాయి అంటే ఇలాగే ఉంటుందా? అన్నంతగా ఆకట్టుకుంటుంది. సరిగ్గా మూడు గంటల క్రితం ఇన్ స్టాలో ఈ ఫోటోని పూజా పోస్ట్ చేసింది.దీంతో అది వైరల్ గా మారింది. పూజా అభిమానులు ఏకంగా లవ్యూ చెబుతూ ..పెళ్లి చేసుకుంటామని కామెంట్లు పెడుతున్నారు. ప్రిన్సెస్ లా ఉన్నారు..ది ఎటెర్నల్ క్వీన్ ఆఫ్ ఫిలిం ఇండస్ట్రీ..మీరు అసలు అందమైన అమ్మాయిల సమానులా? లేక దేవుడు మాత్రమే సృష్టించిన రాకుమారివా? అంటూ నెటి జనులు ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఆసక్తికర కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు.కొంత మందిని కొన్ని కొన్ని డిజైనర్ దుస్తుల్లో చూసేసరికి ఎగ్జైట్ మెంట్ అదుపు తప్పుతుంది. రెగ్యులర్ బ్యూటీకి భిన్నంగా కొత్తగా..మరింత అందంగా కనిపించేసరికి ఇలాంటి కామెంట్లు సహజం. ఇటీవలి కాలంలో పూజాహెగ్డే రకరకాల డిజైనర్ దుస్తుల్లో కనిపించే సరికి బోర్ కొట్టింది. మూడు..నాలుగు రోజుల పాటు కేన్స్ ఉత్సవాలు దుస్తుల్లో పూజా హెగ్డే కనిపంచే సరికి ఇండియన్ కల్చర్ పూర్తిగా మిస్ అయింది. ఒక్కసారిగా ఇప్పుడిలా భారతీయ సంప్రదాయ దుస్తుల్లో కనిపించడంతో యువత ఎగ్జైట్ అవుతున్నారు.ఇక పూజాహెగ్డే సినిమాల విషయానికి ఇటీవల వరుసగా బ్యాక్ టూ బ్యాక్ ఫెయిల్యూర్స్ అందుకుంది. అమ్మడు నటించిన 'రాధేశ్యామ్'.. 'ఆచార్య'..' బీస్ట్' మూడు చిత్రాలు కూడా భారీ అంచనాల మధ్య రిలీజ్ అయి బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టినవే. అయితే కొత్త అవకాశల పరంగా ఢోకా లేదు. మహేష్ సరసన ఓ చిత్రంలో నటిస్తుంది. అలాగే కొన్ని బాలీవుడ్ సినిమాలు చేతిలో ఉన్నాయి.'ఎఫ్-3' లో అమ్మడు ఐటం బాంబ్ గానూ ఆకట్టుకుంది. సినిమాకి పాజిటివ్ టాక్ వస్తుంది. దీంతో పూజా సెకెండ్ ఐటమ్ సినిమా కూడా హిట్ ఖాతాలో పడినట్లే. గతంలో 'రంగస్థలం'లో జిగేలు రాణిగా తొలి సక్సెస్ ని అందుకున్న సంగతి తెలిసిందే.

# పాపం ప్రభాస్ కష్టాలు వర్ణణాతీతం

సినిమా ఇండస్ట్రీలో స్టార్ డమ్ ను దక్కించుకోవడం ఎంత కష్టమో.. దాన్ని కాపాడుకునేందుకు అంతకు మించి కష్టపడాల్సిందే. సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోలు కోట్లకు కోట్ల పారితోషికాలు తీసుకుంటారు అనుకుంటారు కాని.. వారు ఎంతో కష్టపడాల్సి ఉంటుంది. యాక్షన్ సన్నివేశాల కోసం ఒల్లు హూనం చేసుకోవాలి. ప్రస్తుతం సలార్ సినిమా కోసం ప్రభాస్ చాలా కష్టపడుతున్నాడంటూ యూనిట్ సభ్యులు చెబుతున్నారు.కేజీఎఫ్ చిత్ర దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న సలార్ సినిమా షూటింగ్ చకచక జరుగుతోంది. కేజీఎఫ్ 2 ప్రమోషన్ సమయంలో 30 శాతం షూటింగ్ ముగించినట్లుగా దర్శకుడు ప్రశాంత్ నీల్ పేర్కొన్నాడు. ఇటీవలే ఒక మేకింగ్ వీడియోను షేర్ చేసి మళ్లీ షూటింగ్ ను మొదలు పెట్టినట్లుగా చెప్పుకొచ్చాడు. నైట్ షూట్స్ తో పాటు భారీ యాక్షన్ సన్నివేశాలను ప్రస్తుతం చేస్తున్నట్లుగా తెలుస్తోంది.సలార్ లో కేజీఎఫ్ కు మించిన యాక్షన్ సన్నివేశాలు ఉండబోతున్నట్లుగా యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ప్రభాస్ సలార్ సినిమా కోసం వెయిట్ తగ్గుతున్నాడట. రెండు విభిన్నమైన పాత్రల్లో ప్రభాస్ కనిపించబోతున్నాడు.మొదట కాస్త ఎక్కువ వెయిట్ ఉన్న పాత్రకు సంబంధించిన సూటింగ్ జరిగింది. ఇప్పుడు బరువు తక్కువ ఉన్న పాత్రకు సంబంధించిన షూట్ ను నిర్వహిస్తున్నారు.దాదాపుగా నెల రోజుల పాటు వర్కౌట్స్ చేసి బరువు తగ్గినట్లుగా చెబుతున్నారు. ప్రభాస్ బరువు తగ్గడం కోసం చాలా కష్టపడ్డాడు అంటూ ఆయన సన్నిహితులు చెబుతున్నారు. మొత్తానికి మరో కేజీఎఫ్ రేంజ్ హిట్ కోసం దర్శకుడు ప్రశాంత్ నీల్ చాలా అంటే చాలా ప్రభాస్ ను ఇబ్బంది పెడుతున్నాడు. ప్రభాస్ గతంలో బాహుబలి కోసం ఎలా అయితే కష్టపడ్డాడో అలా కష్టపడుతున్నాడు.ప్రభాస్ రాధేశ్యామ్ సినిమా తో నిరాశ పర్చాడు. సాహో మరియు రాధేశ్యామ్ ఫ్లాప్ అయినా కూడా ప్రభాస్ క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. బాక్సాఫీస్ వద్ద ఆయన హడావుడి అంతా ఇంతా కాదు. ఉత్తర భారతంలో కూడా మంచి ఆదరణ ప్రభాస్ కు ఉంది. అందుకే కాస్త పాజిటివ్ రెస్పాన్స్ తెచ్చుకుంటే చాలు అక్కడ ఇక్కడ భారీగా వసూళ్లు నమోదు అవ్వడం ఖాయం.

# ఐపీఎల్-2022లో ఉమ్రాన్ మాలిక్ ఎంత సంపాదించాడంటే..!



సన్‌రైజర్స్ హైదరాబాద్ పేసర్ ఉమ్రాన్ మాలిక్ ఐపీఎల్-2022లో అద్భుతంగా రాణించాడు. తన పేస్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. ఐపీఎల్‌లో అద్భుతమైన ప్రదర్శన చేసిన ఉమ్రాన్.. ఏకంగా భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరగనున్న టీ20 సిరీస్‌కు ఉమ్రాన్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. ఇది ఇలా ఉండగా.. ఈ ఏడాది సీజన్‌లో ఉమ్రాన్ మాలిక్ ఎంత సంపాదించాడో ఓసారి గమనిద్దాం. ఈ సీజన్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ ఆడిన ప్రతి మ్యాచ్ లో ఫాస్టెస్ట్ డెలివరీ అవార్డు మాలిక్ దే. ఈ అవార్డుల ద్వారా మాలిక్ రూ. 14 లక్షలు సంపాదించాడు.అదే విధంగా పంజాబ్ కింగ్స్,గుజరాత్ టైటాన్స్‌పై అత్యుత్తమ ప్రదర్శన చేసిన మాలిక్‌కు రెండుసార్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'అవార్డు కూడా లభించింది. ఈ రెండు అవార్డుల ద్వారా అతడు రూ. 2లక్షలు సంపాదించాడు. ఇవే గాక గుజరాత్, పంజాబ్ తో మ్యాచ్ లలో ప్రదర్శనకు గాను గేమ్ ఛేంజర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ల ద్వారా మరో రెండు లక్షలు పొందాడు.పంజాబ్ తో మ్యాచ్ లో మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కూడా ఉమ్రాన్‌కే దక్కింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**